



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



చంద్రబాబు హయాంలోనే కాపు సామాజికాభివృద్ధి: సవిత

- వివరాలు 9 లో..



# అభివృద్ధికి అడ్డుపడే చట్టాల రద్దు!

- 13ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌పై త్వరలో నిర్ణయం
- ఫ్యాక్షనిజం, నక్సలిజంపోయి.. రప్పా రప్పా రాజకీయం వచ్చింది
- నాడు ప్రభువా క్షమించు అన్నాడు జగన్..
- కల్తీనెయ్యితో ఘోర అపచారం చేసి ఏడుకొండల వాడిని క్షమాపణ అడగడే
- 5 కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీలో చర్చలు, నిర్ణయాలు
- ద్రవ్య వినిమయ బిల్లు సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం
- ఆత్మనిర్భర్- వికసిత్ భారత్ సంకల్పంపై చేసిన తీర్మానానికి శాసనసభ ఆమోదం

2

*'గత పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. గడచిన 20 నెలల్లో కష్టాలు, సమస్యల్ని అధిగమించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం. విధ్వంసంనుంచి వికాసంవైపు, సంక్షోభంనుంచి సంక్షేమంవైపుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 15 రోజులపాటు జరిగిన శాసనసభలో ఐదుకోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయి. భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసంవల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో 94 శాతం గెలవటం మా అందరిపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలన్నీ పూర్తిసఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం'*

## నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

- రైసినా డైలాగ్ 2026 సదస్సుకు హాజరుకానున్న చంద్రబాబు
- సాంకేతికత- సుపరిపాలనపై సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం
- సదస్సులో పాల్గొననున్న 110 దేశాలకు చెందిన 2,700మంది ప్రతినిధులు

4




## దిగ్విజయంగా 'తల్లికి వందనం'

- 67 లక్షలమందికి రూ.8,454 కోట్లమేర ఆర్థికసాయం
- అర్హులందరికీ సాయమే ప్రజా ప్రభుత్వ నిర్ణయం
- వైసీపీ హయాంలో 52శాతంమంది విద్యార్థులకే సాయం
- కూటమి ప్రభుత్వంలో 85శాతానికి సాయం అందించాం
- శాసనమండలిలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్

4



## చర్చలకు ప్రభుత్వం సిద్ధం

- అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చిస్తాం
- ధర్నాలు చేయాల్సిన అవసరం లేదు
- మండలిలో వైసీపీ సభ్యుల వాకౌట్‌పై లోకేష్ ఆగ్రహం

4

## 'మా పిల్లలు బంగారం'

- నిజాయితీ, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లోకేష్ ప్రశంస

3



## ఎప్పటికప్పుడు కేంద్రానికి అప్‌డేట్స్

- పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం ఆదేశం
- ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యతలో రాజీ లేదు
- ప్రాధాన్యతలవారీగా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం
- నిధులపై ఆర్థిక శాఖ రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలి
- ఇరిగేషన్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

3





## అంతర్జాతీయస్థాయి థీమ్‌పార్కులపై దృష్టి

- పెట్టుబడులను ఆకర్షించేందుకు భారీ ప్రణాళికలు
- శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

9

## గండికోట నిర్వాసితులను వైసీపీ దగాచేసింది

మండలిలో జలవనరుల మంత్రి నిమ్మల



10


- ఉల్లాసంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక సంబరం



5

## ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే

# కాన్పు సమయంలో రూ.25 వేలు ప్రోత్సాహకం



## పాపులేషన్ మేనేజ్‌మెంట్

పాలసీపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబుగారి ప్రకటన


## ఏప్రిల్ 1 నుంచి కొత్త పాలసీ అమలు

## చంద్రబాబుగారి దార్శనికతకు ఇది మరో నిదర్శనం

చైతన్యరథం

# అభివృద్ధికి అడ్డుపడే చట్టాల రద్దు!

- 13ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌పై త్వరలో నిర్ణయం
- ఫ్యాక్షనిజం, నక్సలిజంపోయి.. రప్పా రప్పా రాజకీయం వచ్చింది
- నాడు ప్రభువా క్షమించు అన్నాడు జగన్..
- కల్తీనెయ్యితో ఘోర అపచారం చేసి ఏడుకొండల వాడిని క్షమాపణ అడగడేం
- 5 కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీలో చర్చలు, నిర్ణయాలు
- ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రవర్తనతో ప్రభుత్వానికి ఇబ్బందులు తేవొద్దు
- ద్రవ్య వినిమయ బిల్లు సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం
- ఆత్మనిర్భర్- వికసిత్ భారత్ సంకల్పంపై చేసిన తీర్మానానికి శాసనసభ ఆమోదం



అమరావతి (చైతన్య రథం): సామాజిక మాధ్యమాల కారణంగా 13 ఏళ్లలోపు పిల్లలు నష్టపోకుండా నిషేధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని.. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి 90 రోజుల్లో విధి విధానాలు ప్రకటిస్తామన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చల విడితనంపై మంత్రి నారా లోకేష్ లోకేశ్ అధ్యయనం చేసి కొన్ని సిఫార్సులు చేశారని సీఎం వెల్లడించారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. గత పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధివైపు నడిపిస్తున్నామన్నారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'గత పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. గడచిన 20 నెలల్లో కష్టాలు, సమస్యల్ని అధిగమించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం. విధ్వంసంనుంచి వికాసంవైపు, సంక్షోభంనుంచి సంక్షేమంవైపుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 15 రోజులపాటు జరిగిన శాసనసభలో ఐదుకోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయి. భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసంవల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో 94 శాతం గెలవటం మా అందరిపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలన్నీ పూర్తిసఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

## ప్రజలు ఓటేస్తేనే అధికారం.. ప్రతిపక్షం

"తీవ్ర అగమ్యగోచరంగా మారిపోయిన రాష్ట్ర భవిష్యత్తును తిరిగి నిర్మించేలా, గట్టెక్కించే బాధ్యత తీసుకున్నాం. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టాం. ఎన్డీఏ పార్టీలన్నీ పూర్తి సమన్వయంతో వెళ్లబట్టే అనుకున్నది సాధించగలిగాం. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ శాసనసభకు రాకుండా తప్పించుకు తిరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వస్తామని చెప్పటం ఏమిటి.? ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం, ప్రతిపక్ష హోదా వస్తాయి. ఈ నిబంధనలన్నీ రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నాయి. ఇవన్నీ తెలియకుండానే రాజకీయం చేస్తున్నారు. గత పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసమయ్యాయి. అలాంటి పరిస్థితిని చక్కదిద్ది గాడినపెట్టాం. 92 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వీర్యం చేశారు. కేంద్రం నిధులు దారి మళ్లించారు. ఒక్క జల జీవన్ మిషన్‌లోనే రూ.85 వేల కోట్లు రావాల్సి ఉంటే కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదనలు పెట్టారు. ఆ పథకానికి 5 ఏళ్లలో చేసిన ఖర్చు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. మేం అధికారంలోకి వచ్చాక పథకం సమయాన్ని పొడిగించాలని కోరాం. ఇంటింటికీ కుళాయి ఇచ్చేలా ఈ జల్‌జీవన్ మిషన్‌ను ప్రణాళిక చేశాం. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అభినందిస్తున్నాను" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులు తాకట్టుతో ప్రజాధనం దుర్వినియోగం

"ప్రజలకు మెరుగైన సుపరిపాలన ఇచ్చేందుకు నిరంతరం పోరాటం చేశాం. గత పాలకులు ప్రభుత్వ ఆస్తులు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఎమ్మార్వో ఆఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్క్యూట్ హౌస్‌లాంటి ఆస్తులను తాకట్టు పెట్టారు. 12, 13 శాతంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వ ఆర్థిక వనరుల్ని దుర్వినియోగం చేశారు. రూ.43,298 కోట్ల విలువైన అప్పులకు ప్రభుత్వం రీ షెడ్యూలు చేయించాం. తద్వారా రూ.328 కోట్ల మేర ఆదా అవుతుంది. మరో రూ.లక్ష కోట్లమేర అప్పులు కూడా రీ షెడ్యూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల రూ.1,658 కోట్ల వెసులుబాటు వస్తుంది. ఈ నిధులతో మరో సంక్షేమ పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి తన స్వార్థంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేశాడు. గోదావరి పుష్కరాలకంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లిస్తాం. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్‌లో పెట్టాం. మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుంది. వచ్చే సమావేశాలకు ఎమ్మెల్యేలు, మంత్రులు రాజధానిలోని వారి క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్ర నిధులతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చింది. స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోంది" అని ముఖ్యమంత్రి తెలిపారు.

## గత పాలనలో ట్రూ అప్.. కూటమి వచ్చాక ట్రూ డౌన్

"రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. 20 నెలల్లో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. హంద్రీనీవాకు రూ.3850 కోట్లు ఖర్చు చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. అనంతపురంలాంటి జిల్లాకు 55 టీఎంసీ నీటిని తీసుకువెళ్లాం. ప్రస్తుతం వేసవి వచ్చినా 628 టీఎంసీ నీరు వివిధ రిజర్వాయర్లలో నిల్వ ఉంది. సమర్థ నీటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. భూగర్భజలాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో 2.96 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగేలా వివిధ సంరక్షణా చర్యలు చేపట్టాం. భూగర్భ జలాలు పెరగటంవల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. ఆమేరకు వ్యయాన్ని ఆదా చేసుకున్నాం. ఎన్ని ఇబ్బందులున్నా కరెంటు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. గత పాలకులు రూ.32 వేల కోట్ల కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపారు. ట్రూ అప్ భారంవేస్తే చరిత్రలో తొలిసారి మేం ట్రూడౌన్ చేశాం. రూ.4420 కోట్లమేర ట్రూఅప్ భారాన్ని ప్రజలపై మోపకుండా చర్యలు తీసుకున్నాం. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర ప్యానెళ్లు ఏర్పాటు చేసి ఇంటిపైనే విద్యుదుత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ.5.19 నుంచి 4.80కు తగ్గించేలా చర్యలు చేపట్టాం. అగ్రిటెక్‌తో వ్యవసాయరంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రూ.లక్ష కోట్లతో ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమ జిల్లాలను హార్టీకల్చర్ హబ్‌గా పూర్వోదయ పథకం కింద అభివృద్ధి చేస్తాం' అని సీఎం తెలిపారు.

## ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ బెన్‌ఫిట్ కార్డు

"ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇవ్వాలనే పది సూత్రాలతో 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాం. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. త్వరలోనే ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం కార్డును కూడా జారీ చేస్తాం. కేంద్రం, రాష్ట్రం అందించే పథకాలన్నిటినీ ఈ కార్డు ద్వారా ఇంటిగ్రేట్ చేస్తాం. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీతో వ్యర్థాల ద్వారా సంపద సృష్టిస్తున్నాం. ఇటీవలే వివాదాల పరిష్కారించేలా మధ్యవర్తిత్వంపై సదస్సు జరిగింది. మధ్యవర్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచనలు వచ్చాయి. వివాదం పరిష్కారమైతే రూ.10 వేల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేసి అవినీతిని కట్టడి చేశాం. జన్‌విశ్వాస్ ద్వారా పాత చట్టాలను రద్దు చేస్తున్నాం. అవసరమైన మార్పులు చేస్తున్నాం. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపింది. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు మాత్రమే వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం చర్యలు తీసుకున్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలలు నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం కూడా జరుగుతోంది. 9 కోట్ల పని దినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగింది. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## వైట్‌కాలర్ క్రైమ్స్, సోషల్ సైకోల అరాచకం

"స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నాం. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నాం. సుప్రీంకోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తాం. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం. హెల్తీ, వెల్తీ హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాను. మావోయిస్టులను కట్టడి చేశాం, ఫాక్షనిజం రూపుమాపాం తద్వారా ప్రగతి సాధించాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## పెళ్లికివెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు.. ఎక్కడి సంస్కృతి?

"రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చింది. ఓ రాజకీయ నాయకుడు పర్యటన చేస్తే రప్పా రప్పా అంటున్నారు. పెళ్లికివెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రత కోసం వెళ్లిన ఎస్ఐ గాయపడినా పట్టించుకోవటం లేదు. గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకుని తిరిగే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా? పోస్టు మార్టానికి కారకులైనవారు పోస్టుమార్టానికే వెళ్తారు. రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి? టైర్లుకింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి? 5 కిలోమీటర్ల దూరాన్ని 6-7గంటలపాటు ప్రయాణిస్తారా ఎవరైనా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటంఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈవిధంగా వ్యవహరించలేదు"అని ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్మార్గరాజకీయ వైఖరిపై ధ్వజమెత్తారు.

## రెండు కొండలన్నప్పటినుంచే కుట్రలు

"తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రం చేశారు. ఇది తెలియకుండా జరిగిన వ్యవహారం కాదు. కుట్రతోనే కావాలని చేసిననేరం.ఏడు కొండలను రెండుకొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోంది. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదిక కూడా అది కల్తీ నెయ్యి అని స్పష్టంగా తేల్చి చెప్పింది. దేశవ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్తకంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్దఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి.. తిరుమల నైవేద్యం కల్తీచేసి ఏడుకొండల స్వామికి క్షమాపణలు చెప్పరా? మత సామరస్యాన్ని గౌరవించకుండా.. క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా?" అని సీఎం చంద్రబాబు నిలదీశారు.

## వ్యక్తిగత ప్రవర్తనతో చెడ్డపేరు తేవొద్దు

"పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాలతో మన మార్కెట్లు ప్రభావితం అవుతున్నాయి. ఎగుమతులు పడిపోవటంతో అరటి ధర తగ్గిపోయింది.చమురు ధరలవల్ల కూడా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజా ప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజాప్రతినిధులు-అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరుతున్నాను. కూటమిగా వెళ్లి ప్రజల మద్దతుతోనే అంతా గెలిచామని గుర్తుంచుకోవాలి. వ్యక్తిగత ప్రవర్తనవల్ల ప్రభుత్వానికి, పార్టీలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కోరుతున్నాను. 15ఏళ్లపాటు ఎన్డీఏ కూటమి కొనసాగితేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నారు. కూటమిగా మనకు ఓ అజెండా ఉంది. 2029లోనూ మనంగెలిచి 2047 లక్ష్యాలను సాధించుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

చైతన్యరథం

# ఎప్పటికప్పుడు కేంద్రానికి అప్‌డేట్స్

- పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం ఆదేశం
- ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యతలో రాజీ లేదు
- ప్రాధాన్యతలవారీగా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం
- నిధులపై ఆర్థిక శాఖ రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలి
- ప్రాజెక్టులు సుదీర్ఘకాలం ఎన్నికల హామీలు కాకూడదు
- ఇరిగేషన్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి (చైతన్య రథం): ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యతపై రాజీ ప్రసక్తే ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టే క్రమంలో ప్రజాభద్రత ముఖ్యమనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై శుక్రవారం అసెంబ్లీలోని తన ఛాంబర్లో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీ-నీవా, పోలవరం-నల్లమల సాగర్‌లింక్, చింతలపూడి లిఫ్ట్, వరికపూడిశెల లిఫ్ట్, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల ప్రగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. వివిధ ప్రాజెక్టులకు చేపట్టాల్సిన పునరావాస పనులపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యమిస్తోంది. రకరకాల కారణాలతో రాష్ట్రంలో కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు సుదీర్ఘ కాలంపాటు ఎన్నికల హామీలుగా మిగిలిపోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాకపోవడం సరికాదు. ఇలాంటి వాటికి చెక్‌పెట్టాలి. ప్రాజెక్టులు కట్టాలనే డిమాండ్లు ఎన్నికల హామీలుగా మిగిలిపోకూడదు. ప్రజల అవసరాలను తీర్చేలా ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయాలి. అందుకే ప్రణాళికాబద్దంగా... ప్రాధాన్యతలను సిద్ధం చేసుకుని ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నాం. పోలవరంసహా రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తిచేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాం. ఇరిగేషన్‌రంగానికి గతంలోనూ... ఇప్పుడు పెద్దపీట వేసి అవి పూర్తయ్యేలా చేసింది.. చేస్తోంది కూటమి ప్రభుత్వమే. ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే ఉండకూడదు. ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తాను. ఉన్నతాధికారులు మొదలుకుని.. క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది ఏ ఒక్కరూ అలక్ష్యం వహించినా చర్యలు తప్పదు. ఉమ్మడి రాష్ట్రంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు... గత ప్రభుత్వ పాలనలోనూ ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణ్యత విషయంలో కాంప్రమైజ్ అయ్యేవారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఝంఝావతి రబ్బర్ డ్యాం కొట్టుకుపోయింది. గత ప్రభుత్వంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ దెబ్బతినేలా చేశారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు రిపేర్లు చేసినా సరిపోతుందని నిపుణులు నివేదికలు ఇచ్చినా.. నాణ్యత విషయంలో, ప్రజాభద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రతి అంశమూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి**

"పోలవరం నిర్మాణం విషయంలో కేంద్రంతో నిరంతరం టచ్‌లో ఉండాలి. పోలవరం నిర్మాణానికి సంబంధించిన ప్రతి అప్డేట్ కేంద్రంలోని సంబంధిత వ్యవస్థలకు ఎప్పటికప్పుడు చేర్చాల్సిందే. ప్రమాణాలు, నాణ్యత పాటించే విషయం సహా నివేదికల పరంగా, సాంకేతికాంశాల పరంగా, డాక్యుమెంటేషన్ పరంగా ఎలాంటి లోపాలు ఉండకూడదు... తేడాలు రాకూడదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం సహా ఎవ్వరూ వేలెత్తి చూపే పరిస్థితి రాకూడదు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు అంతర్జాతీయ స్థాయి నిపుణులు తరుచూ సందర్శనకు వచ్చేలా చూడండి. వీలు కాకుంటే వీడియో కాన్ఫరెన్సుల ద్వారానైనా వారి సలహాలను స్వీకరించండి. చారిత్రాత్మక నిర్మాణాలు చేపడుతున్నప్పుడు.. జీవనాడి లాంటి ప్రాజెక్టులను చేపడుతున్నప్పుడు అదే స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రమాణాలు పాటించే విషయంలో చాలా కచ్చితంగా ఉంటాను. రాష్ట్ర ప్రభుత్వం టైం బౌండ్ పెట్టుకుని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతోందనే విషయాన్ని కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఇకపై పోలవరం ప్రాజెక్టుపై ప్రతి నెలా సమీక్షిస్తా. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు రిలాక్స్ కావడానికి వీల్లేదు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు మేఘాద్రిగడ్డ వరకు పూర్తి కావాలి. రైట్ మెయిన్ కెనాల్ లో ఇంకా రూ. 200 కోట్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటిని కూడా ఈ సీజన్లో పూర్తి చేయాలి. డయాఫ్రం వాల్ నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి. 41.15 మీటర్ల వరకు నీళ్లను నిలిపేందుకు అవసరమైన నిర్మాణ, పునరావాస పనులు కంప్లీట్ కావాలి. పునరావాసం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే... వెంటనే పరిష్కరించుకోవాలి. దీనికి అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతుల విషయంలో జాప్యం చేయవద్దు. పునరావాసం విషయంలో నిర్వాసితులతో నిరంతరం సంప్రదింపులు జరిపి సాఫీగా ఆర్ అండ్ ఆర్ పనులు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**వెలిగొండ... ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు పరుగులు పెట్టాలి**

"వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ. 2041 కోట్లు అవసరమవుతాయి. ఓవైపు ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతూనే.. మరోవైపు పునరావాసం పైనా ఫోకస్ పెట్టాలి. దీనికి అవసరమైన మేరకు విడతల వారీగా నిధులను విడుదల అయ్యేలా ఆర్థిక శాఖ అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకోవాలి. హంద్రీ-నీవా ఫేజ్-1 కెనాల్ వైడెనింగ్ 92 శాతం పూర్తి అయింది. కుప్పం-పుంగనూరు కాల్వలను 85 శాతం కంప్లీట్ చేసుకున్నాం. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. హంద్రీ-నీవా జలాలు మడకశిర వరకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. అనుమతులు సాధించాలి. వరికిపూడిశెల ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు వచ్చేస్తే పనులు మొదలు పెట్టండి. అలాగే ప్రాధాన్యత క్రమంలో చింతలపూడి లిఫ్ట్ పనులను పూర్తి చేయాలి. ఉత్తరాంధ్రలో చిన్న చిన్న ప్రాజెక్టులను కూడా పెండింగులో పెట్టేశారు. తక్కువ ఖర్చు పెడితే పూర్తయ్యే ప్రాజెక్టులను ముందుగా టేకప్ చేసే అంశాన్ని పరిశీలించండి. వంశధార-నాగావళి, తోటపల్లి బ్యారేజ్, తారకరామ, మహేంద్ర తనయ ఆఫ్ షోర్, హీర మండలం, మద్దువలస, ఝంఝావతి, నాగావళి-చంపావతి లింక్ వంటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలి.. ఫలితం చూపెట్టాలి. ఏపీఎస్ఐడీసీ పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మత్తులు, నిర్వహణ కోసం హ్యామ్ పద్ధతిలో పనులు చేపట్టాలి. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసుకోవాలి. ఈ మేరకు ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకోవాలి. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిమిత్తం విడతల వారీగా నిధులు విడుదల చేసే విధంగా ఆర్థిక శాఖ రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించారు.

---

## ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం

- ఏపీలో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ ఏర్పాటుకు కేంద్రం ప్రోత్సహిస్తోంది
- శాసనమండలిలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల వివరాలు, ఈఎమ్ సీలో పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన భూవిస్తీర్ణం, ఖాళీగా ఉన్న భూవిస్తీర్ణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో మూడు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ ఉన్నాయి. వీటి వివరాలు ఇవ్వడం జరిగింది. ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది కాబట్టే ఏపీలో పెట్టుబడులు పెట్టాలని, ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాలని కేంద్రం కూడా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా విశాఖలో ఏసిప్ అనే సంస్థకు భూములు కేటాయించడం జరిగింది. ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం. చిన్న, చిన్న సమస్యలు ఏమైనా ఉంటే యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

---

## 'మా పిల్లలు బంగారం'

- నిజాయితీ, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లోకేష్ ప్రశంస

తిరుపతి (చైతన్య రథం): నీతి నిజాయితీలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలు బంగారం అంటూ విద్యామంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. తిరుపతి సంఘటనపై సమాచారం అందుకున్న మంత్రి లోకేష్.. దానిపై ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "తిరుపతి జిల్లా వెంకటగిరి జెడ్పీ హైస్కూల్ బాలికల హైస్కూలులో చదువుతున్న మా పిల్లలు బంగారం అని నిరూపించుకున్నారు. గురువారం సాయంత్రం స్కూల్ విడిచిపెట్టిన తరువాత.. వెంకటగిరి ఎస్బీఐ బ్యాంకువద్ద మన్నవరం బస్సుకోసం నిరీక్షిస్తున్న కొత్తపల్లిగుంటకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు బి గురుప్రియ, బి గీతిక, ఎం గీతిక, 6వ తరగతి చదువుతున్న పద్మశ్రీ, 7వ తరగతి విద్యార్థిని హేమలతలకు రోడ్డుపై పర్సు కనిపించింది. తీసి చూస్తే బంగారం, నగదు. రెండో ఆలోచన లేకుండా అమ్మాయిలంతా పోలీస్ స్టేషన్‌వైపు నడిచారు. ఎస్ఐ స్వరూపకు తమకు దొరికిన పర్సు అందజేసి, అభినందనలు అందుకుని ఇంటికెళ్లేందుకు మళ్లీ బస్టాప్‌వద్దకు వచ్చారు. అక్కడ ఓ మహిళ పర్సుకోసం వెతుకుతూ పిల్లల్ని అడిగింది. తమకే దొరికిందని.. స్టేషన్‌లో ఇచ్చామని చెబుతూ ఆమెతోపాటు స్టేషన్‌కు వెళ్లారు పిల్లలు. నగలు, నగదు ఆమెవేనని నిర్ధారించుకున్న ఎస్ఐ మహిళకు వాటిని అందజేశారు. చిన్న వయస్సులో మీ నీతివంతమైన ప్రవర్తన ఆదర్శంగా నిలిచింది చెల్లెమ్మలూ! మీకు ఎల్లప్పుడూ అండగా ఉండే అన్నగా నేను గర్విస్తున్నాను. మీ నిజాయితీ మన విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసింది. హృదయపూర్వక అభినందనలు చిట్టితల్లులూ.." అంటూ మంత్రి లోకేష్ భావోద్వేగం, అవ్యాజమైన ప్రేమను పోస్టులో చూపించారు.









# నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

- రైసినా డైలాగ్ 2026 సదస్సుకు హాజరుకానున్న చంద్రబాబు
- సాంకేతికత- సుపరిపాలనపై సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం
- సదస్సులో పాల్గొననున్న 110 దేశాలకు చెందిన 2,700మంది ప్రతినిధులు

అమరావతి (చైతన్య రథం): దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత - సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొనేందుకు శనివారం ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు తాజ్ ప్యాలెస్‌లో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016నుంచి ఎంఓఈఏ- ఓఆర్ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట సదస్సును నిర్వహిస్తున్నాయి.




ప్రపంచ రాజకీయాలు- అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచస్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సులాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార-అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరు కానున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధిపథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన- డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థికవృద్ధిని ఎలా వేగవంతం చేయవచ్చన్న అంశాలతోపాటు పాలనలో పారదర్శకత, సంపద సృష్టి, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌వంటి వినూత్న అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులతో తన అనుభవాలను ముఖ్యమంత్రి పంచుకోనున్నారు.

## సెవెన్త్ నుంచి ట్వెల్త్ వరకూ

# ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌లు

- గత ప్రభుత్వంలో రూ.18.96 కోట్ల బకాయిలను ప్రజా ప్రభుత్వం చెల్లించింది
- హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తాం
- శాసనమండలిలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో 7నుంచి 12వ తరగతి బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్‌లను పంపిణీ చేస్తున్నట్టు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోని విద్యార్థులకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్‌లను అందించడంపై శాసనమండలిలో సభ్యులు కావలి గ్రీష్మ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 7వ తరగతినుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్‌లను సరఫరా చేస్తున్నామన్నారు. గతంలో ఏడు రెగ్యులర్ సైజ్, మూడు లార్జ్ సైజ్ న్యాప్‌కిన్‌లు ఇచ్చేవారు. ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాత 5 రెగ్యులర్ సైజ్, 5 లార్జ్ సైజ్ శానిటరీ ప్యాడ్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. గత ప్రభుత్వంలో 18.96 కోట్ల బకాయిలు పెట్టారు. ప్రజా ప్రభుత్వం ఆ బకాయిలను తీర్చడం జరిగింది. ఆర్టీజీఎస్ నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్ చేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోంది. 96శాతం బాలిలకు తమకు శానిటరీ న్యాప్ కిన్‌లు అందుతున్నాయని, 4 శాతంమంది అందడం లేదని చెప్పారు. నాణ్యత విషయంలో 1 శాతం బాగాలేదని, 14 శాతం ఫర్వాలేదు, బాగుందని 85శాతంమంది చెప్పారు. శానిటరీ న్యాప్‌కిన్స్ ఎబ్సార్‌ప్షన్‌పై 84శాతంమంది బాగుందని, 14 శాతంమంది పర్వాలేదని, బాగాలేదని 2శాతం మంది ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. సైజ్ విషయంలో 89శాతం మంది బాగుందని, 11శాతం బాగాలేదని చెప్పారు.

ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ పంపిణీపైనా చర్చించడం జరిగింది. దీనిపైనా పరిశీలన చేస్తాం. ఎన్జీవోలతో మాట్లాడి బాలికల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. వెండింగ్ మిషన్స్ విత్ స్మార్ట్ కార్డ్‌ను ఇప్పటికే కేజీబీవీల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. అన్ని పాఠశాలలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇదో క్యాంపెయిన్‌లా చేస్తాం. దీనిపై అనేక అపోహలున్నాయి. ఇది అవసరం. అందరం కలిసికట్టుగా దీనిపై అవగాహన తీసుకురావాల్సిన అవసరముందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అంతముందు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మాట్లాడుతూ.. విద్యార్థినులకు నెలసరి వచ్చే సమయంలో సరైన హైజీన్ ప్రొడక్ట్స్ అందక పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో చదవుతున్న బాలికలకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ కచ్చితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దిగ్విజయంగా 'తల్లికి వందనం'

- 67 లక్షలమందికి రూ.8,454 కోట్లమేర ఆర్థికసాయం
- అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయం
- వైసీపీ హయాంలో 52శాతం మంది విద్యార్థులకే సాయం
- కూటమి ప్రభుత్వంలో 85శాతానికి సాయం అందించాం
- శాసనమండలిలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): "తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో 67,01,653 మంది విద్యార్థులకు రూ.8,454 కోట్లమేర సాయం అందించాం. అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయం" అని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. "తల్లికి వందనం పథకం, యూడైస్ ప్రకారం రాష్ట్రంలో నమోదైన విద్యార్థుల సంఖ్యపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. యూడైస్ ప్రకారం ఒకటినుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలో 79,51,903 మంది విద్యార్థులు నమోదయ్యారు. తల్లికి వందనం పథకం కింద రూ.8,454 కోట్లు సాయం అందించాం. 67,01,653 మందికి తల్లికి వందనం వర్తించింది. యూడైస్‌లో 86 లక్షలమంది విద్యార్థులు ఉన్నారంటూ వైసీపీ నేతలు అసత్యాలు మాట్లాడుతున్నారు. యూడైస్‌లో నమోదైన వారిలో అర్హులందరికీ (84.27శాతం) సాయం అందించాం" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

"వైసీపీ హయాంలో యూడైస్ కింద 81,72,224 మంది విద్యార్థులు నమోదై ఉంటే.. కేవలం 42,33,098 మందికి మాత్రమే, అంటే 52శాతానికే ఇచ్చారు. మేం 85శాతం మందికి సాయం అందించాం. 2020-21 చూస్తే సుమారుగా 83 లక్షలమంది ఉంటే.. కేవలం 44 లక్షలమందికే ఇచ్చారు. 2021-22లో 82 లక్షలమంది ఉంటే.. కేవలం 43 లక్షల మందికే ఇచ్చారు. 2022-23లో 80 లక్షలమంది ఉంటే.. కేవలం 42 లక్షల మందికే ఇచ్చారు. వైసీపీ హయాంలో 52శాతం మంది విద్యార్థులకు ఇస్తే.. ప్రజా ప్రభుత్వంలో 84.27 శాతంమందికి అందజేశాం. తల్లికి వందనం పథకం కింద సాయం అందని వారి వివరాలు పంపిస్తే.. సరిచేసుకునేందుకు



సిద్ధంగా ఉన్నాం. అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయం" అని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు. కొంతమందికి పాక్షిక సాయం అందించారనే విషయంలో.. సోషల్ వెల్ఫేర్ విభాగంలో కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంది. మేం ముందు చెల్లించిన తర్వాత కేంద్రం నిధులు అందజేస్తోంది. రెండూ కలిసి కట్టుగా మేంఅందిస్తున్నాం. గ్యాప్ ఏమైనావుంటే వివరాలు ఇవ్వాలి. పారిశుద్ధ్య కార్మికులందరికీ తల్లికి వందనం వర్తించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

# చర్చలకు ప్రభుత్వం సిద్ధం

- అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చిస్తాం
- ధర్నాలు చేయాల్సిన అవసరం లేదు
- ఇది ప్రజా ప్రభుత్వం, పరదాలు కట్టుకుని తిరగడం లేదు
- మేం ఎవరినీ అరెస్ట్ చేయలేదు
- శాసనమండలిలో వైసీపీ సభ్యుల వాకౌట్‌పై మంత్రి లోకేష్ ఆగ్రహం

అమరావతి (చైతన్య రథం): అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. వైసీపీ తీరును తప్పుబట్టారు. "ఈ రోజు ప్రతిపక్ష సభ్యులు వెనుక తలుపునుంచి వాకౌట్ చేస్తున్నారు. మొన్న ముందు తలుపునుంచి వాకౌట్ చేశారు. వారు వాకౌట్ చేయాల్సిన పనిలేదు. వినేందుకు సభ్యులకు ఓపిక ఉండాలి. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అని ప్రతిపక్ష నేత బొత్స అన్నారు. అమరావతి పనులు ఎందుకు నిలిపివేశారు? అన్న క్యాంటీన్లను ఎందుకు మూసేశారు? అన్ని సంఘాలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది ప్రజా ప్రభుత్వం. మేం పరదాలు కట్టుకుని తిరగడం లేదు.



విద్యాశాఖలో కూడా వివిధ సంఘాలను కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నాం" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

"అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ధర్నాలు చేయాల్సిన అవసరమే లేదు. మొన్న అంగన్‌వాడీలకు సాయంత్రం 6 గంటలవరకు పర్మిషన్ ఇచ్చారు. వారు మధ్యాహ్న భోజనం కూడా అన్న క్యాంటీన్లలో చేశారు. మంచినీరు కూడా అందించాం. అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచాం. సాయంత్రం తర్వాత అనుమతి లేకుండా ఉండటంతో అందరం కంగారుపడ్డాం. వారి రక్షణ దృష్ట్యా బతిమిలాడి మహిళా కానిస్టేబుల్స్‌తో తీసుకెళ్లడం జరిగింది. మేం ఎవరినీ అరెస్ట్ చేయలేదు. ఎవరిపైనా కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. వారితో చర్చించే మేం పనిచేస్తాం. వారిని పిలుస్తాం, మాట్లాడతాం. వేతనాలపెంపు పరిశీలనలో ఉందని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి కూడా నిర్ణయం తీసుకుంటారని అంగన్‌వాడీలకు తెలియజేస్తున్నా. ఆశావర్కర్లు, వీఏవోలకు కూడా ప్రభుత్వం తరపున హామీ ఇస్తున్నా" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

చైతన్యరథం





విజయవాడలోని ఆంధ్రా లూక్స్ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.
జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.








## అలరించిన శాసనసభ్యుల
# సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడ (చైతన్య రథం): అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా విజయవాడలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నేతలంతా తమ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. నేతల కుటుంబసభ్యుల ఆత్మీయ కలయిక ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నేతలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నేతల పిల్లలతో మంత్రి నారా లోకేశ్ సరదాగా ఆటలు ఆడారు. 'ఆటవిడుపు' పేరిట ఇటీవల నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బహుమతులు ప్రదానం చేశారు. బడ్జెట్ సమావేశాలు పూర్తయిన సందర్భంగా సభ్యులు, వారి కుటుంబసభ్యులకు మంత్రి పయ్యావుల కేశవ్ ఆత్మీయ విందు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ ప్రార్థనా గీతం ఆలపించారు.















చైతన్యరథం



# ఉల్లాసంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక సంబరం



## ప్రజాప్రతినిధులు కుటుంబంలా కలిసి పనిచేయాలన్న సీఎం

## ప్రతిభా నేతలకు బహుమతులు అందించిన చంద్రబాబు

విజయవాడ (చైతన్య రథం): ప్రజాప్రతినిధుల మధ్య జరిగిన క్రీడా పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రొఫెషనల్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. వారిని చూస్తుంటే తనకు పాత రోజులు గుర్తొస్తున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీకే పరిమితం కాకుండా ఆల్ రౌండర్లుగా నిలిచారని అన్నారు. విజయవాడలోని ఆంత్రా లక్స్ కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నేతల క్రీడల్లో చక్కగా రాణించారు. క్రీడోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్టీఆర్ పాత్రలో జీవించారు. నేతన్నలను ప్రోత్సహించేందుకు మహిళా ప్రజా ప్రతినిధులు చేనేత వస్త్రాలు ధరించి రావడం అభినందనీయం. ప్రతి ఒక్కనేత కలిసిమెలిసి కుటుంబంలా పనిచేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన సభ్యులకు ముఖ్యమంత్రి బహుమతులు అందజేశారు. అంతకుముందు "హు ఈజ్ హు" అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఏపీ శాసన మండలి సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


















## రూ.441 కోట్ల ఆస్తుల అటాచ్

**- ఏపీ మద్యం కుంభకోణం**

అమరావతి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు కనబరుస్తోంది. కేసులో కీలక నిందితులు కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బూనేటి చాణక్య, దొంతరెడ్డి వాసుదేవరెడ్డికి చెందిన రూ.441 కోట్ల విలువైన ఆస్తులన్నీ తాజాగా అటాచ్ చేసింది. మద్యం కుంభకోణం ద్వారా ప్రభుత్వానికి రూ.4 వేలకోట్ల మేర నష్టం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2019 తర్వాత లిక్కర్ పాలసీలో మార్పులు చేసినట్లు ఈడీ గుర్తించింది. పాత మద్యం బ్రాండ్లను మార్కెట్ నుంచి తొలగించి, ఫేవర్ బ్రాండ్లకు ప్రత్యేక ఆర్డర్లు ఇచ్చినట్లు విచారణలో ఈడీ అధికారులు గుర్తించారు. ప్రతి కేసుపై 15 నుంచి 20శాతం వరకు కిక్ బ్యాక్ తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. కమిషన్ ఇవ్వని కంపెనీలకు సరఫరా ఆర్డర్లు నిలిపివేసినట్లు ఈడీ గుర్తించింది.

**గుంటూరు జైలుకు వాసుదేవరెడ్డి**

ఇదిలావుంటే, ఏపీ మద్యం కేసులో నిందితుడు వాసుదేవరెడ్డి సిట్ విచారణ పూర్తయింది. రెండ్రోజులపాటు ప్రశ్నించిన సిట్ అధికారులు మద్యం విక్రయం, కేటాయింపులపై ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం. వైద్య పరీక్షల తర్వాత వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు ఏసీబీ కోర్టుకు తరలించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వాసుదేవరెడ్డి బెవరేజెస్ ఎండీగా పని చేశారు.

## రెండోరోజు సునీల్ నాయక్ విచారణ

అమరావతి (చైతన్య రథం): ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణ రెండోరోజు కొనసాగుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం నుంచి విచారణ ప్రారంభమైంది. విచారణాధికారి విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో రెండోరోజు విచారణ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల వరకు గుంటూరులోని సీసీఎస్ స్టేషన్లో విచారణ కొనసాగనుంది. నిన్న దాదాపు 5 గంటలపాటు ఆయన్ను ప్రశ్నించారు. కేసుకు సంబంధించిన ప్రాథమిక అంశాలపైనే ఎక్కువగా ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సునీల్ నాయక్ కొన్ని ప్రశ్నలకు అసంపూర్తిగా, మరికొన్నింటికి అరకొరగా సమాధానాలివ్వగా, కొన్నింటికి మౌనం వహించినట్లు సమాచారం.

**మార్చి 25న షెడ్యూల్డ్ తెగల**

## సంక్షేమ కమిటీ సమావేశం

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభకు చెందిన 'షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ' సమావేశం మార్చి 25 బుధవారం ఉదయం వెలగపూడి అమరావతిలోని అసెంబ్లీ భవన్‌లో కమిటీ హాల్‌లో జరగనుందని సెక్రటరీ జనరల్ టు లెజిస్లేచర్ సూర్యదేవర ప్రసన్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులిస్తా

**మంత్రి వాసంశెట్టికి డిప్యూటీ సీఎం హామీ**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పెండింగులో ఉన్న పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై మంత్రి సుభాష్ సమగ్ర వినతిపత్రాన్ని పవన్‌కు సమర్పించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల పరిస్థితిని వివరించిన మంత్రి... నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. కొత్త సిమెంటు రోడ్ల నిర్మాణం, పాడైపోయిన పాత రోడ్ల మరమ్మతులకు నిధులు, గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం, తాగునీటి సదుపాయాల కల్పన, నియోజకవర్గంలోని శ్మశానవాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్... కూటమి ప్రభుత్వం ప్రజాభివృద్ధి పనులకే ప్రథమ ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపుపై తక్షణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి పనులపట్ల సానుకూలంగా స్పందించి, నిధుల హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తప్పుడు లెక్కలు చెప్పొద్దు

**బొత్స ఆరోపణలకు ఆధారాలు చూపించాలి : మండలిలో వైసీపీ ఆరోపణలపై మంత్రుల భగ్గు**

అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'ఫ్యామిలీ బడ్జెట్' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై చర్చలో ఇతర విషయాలు రావడం బాధాకరమన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి ఆర్థిక భారం తగ్గించామన్నారు. మహిళల సమస్యలు తెలుసు కాబట్టే.. ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. సామాన్యుడికి మేలు చేసేందుకే అన్న క్యాంటీన్లు పెట్టినట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులుగా మనం ఏం చేశామన్నదే కీలకం. మనం చేసిన పనులు మాత్రమే చరిత్రలో ఉంటాయి. గత వైకాపా ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలిపెట్టి వెళ్లింది. ప్రస్తుతం ఆ చెత్తను కూడా తొలగించాల్సి వస్తోంది. బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. అప్పులు చేయడం తప్పని చెప్పలేదు. చేసిన అప్పులను ఎలా ఉపయోగిస్తామనేది కీలకం. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేయవద్దని కోరుతున్నా" అని పయ్యావుల అన్నారు.

**బొత్స ఆరోపణలు.. ఖండించిన మంత్రులు**

అంతకుముందు కాగ్ రిపోర్టుపై ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రెవెన్యూ, జీఎస్టీ వసూళ్లలో దేశంలో ఏపీ 22వ స్థానంలో ఉందని బొత్స అన్నారు. సున్నా వడ్డీ కింద ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని, మహిళలను లక్షాధికారులను ఎలా చేస్తారో చెప్పాలని నిలదీశారు. పీఎం ఫసల్ బీమా యోజన అమల్లో లెక్కలు సరిగా లేవని ఆరోపించారు. మొక్కజొన్న, మామిడి, పొగాకు, మిరప, టమాటా, వరికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. 'సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్' అని మీరే అంటే ఎలా? అని ప్రశ్నించారు. బొత్స ఆరోపణలను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి ఖండించారు. బొత్సకు వచ్చిన జాబితా ఎక్కడినుంచి వచ్చిందో చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కోరగా.. అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తమకు లేదని బొత్స అన్నారు.



# ఆత్మవిశ్వాసమే ఆయుధం!

- **ఏ పరిస్థితుల్లోనూ మహిళలు ధైర్యంగా ముందుకెళ్లాలి**
- **వుమెన్స్ డే వేడుకల్లో మల్లికా గార్గ్ పిలుపు**




విజయవాడ (చైతన్య రథం): మహిళలు తమ సామర్థ్యాన్ని గుర్తించి ధైర్యంగా ముందుకు సాగితే ఏ రంగంలోనైనా అగ్రస్థానానికి చేరుకోవచ్చని ఐపీఎస్ అధికారిణి మల్లికా గార్గ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మహిళా అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం గురునానక్ కాలనీలోని ప్రయివేట్ హోటల్‌లో జరిగిన వుమెన్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఏపీపీసీబీ ఛైర్మన్ పి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్రవంతి హాస్పిటల్స్ వ్యవస్థాపకురాలు స్రవంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. కుటుంబాన్ని సమర్థంగా నడిపించడమే కాకుండా పరిపాలన, విజ్ఞానం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణవంటి అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధికి దారి తీస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో కూడా మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఐపీఎస్ అధికారిణి మలికాగార్గ్ మాట్లాడుతూ.. మహిళా సాధికారత కేవలం నినాదం మాత్రమే కాకుండా ప్రతి మహిళ జీవితంలో ఆచరణలో ఉండాల్సిన అంశంగా అభివర్ణించారు. మహిళలు.. ఈ పని మాత్రమే చేస్తారు. ఫలానా పని చేయలేనని గిరిగీసుకోకుండా.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగలననే ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ 'కుటుంబాన్ని చూసుకునే మహిళలు తమ ఆరోగ్యాన్ని అంతగా పట్టించుకోరు. కానీ, మధ్య వయసుకొచ్చాక ఏడాదికి రెండుసార్లు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే ముందస్తు అనారోగ్య సమస్యల్ని గుర్తించడంతోపాటు... వాటినుంచి బయట పడటం తేలికవుతుంది. ఇక టీనేజర్ల విషయానికొస్తానికి, రోడ్డుపక్క దొరికే ఆహారం కల్తీ అవుతుందని గ్రహించి అలాంటి వాటికి దూరంగా ఉండాలి. కల్తీ ఆహారంవల్ల హార్మోన్ల లోపంతోపాటు.. చిన్న వయసులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారు. మహిళలు తమ పిల్లలకు ఇంటి ఆహారాన్ని అందించి... వారికి శారీరక శ్రమతోపాటు కంటినిండా నిద్ర ఉండేలా చూడాలి. అప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం సాధ్యమవుతుంది' అంటూ ఆరోగ్య సూత్రాలను బోధించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విజేతలైన వారికి అతిథులు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు.

# అంగన్వాడీలకు వేతనాల పెంపు!

**ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదన: మంత్రి గుమ్మడి సంధ్యారాణి**

అమరావతి (చైతన్యరథం): శాసనమండలిలో అంగన్వాడీల సంక్షేమంపై అడిగిన ప్రశ్నకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వివరణ ఇచ్చారు. ఎమ్మెల్సీ టి.కల్పలత అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... అంగన్వాడీ కార్యకర్తల గౌరవ వేతనాన్ని పెంచే ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని కీలక ప్రకటన చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల వ్యవహరించిన తీరును మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. 'గతంలో అంగన్వాడీలు 40 రోజులు ధర్నా చేస్తే పట్టించుకోని వారికి, ఈరోజు వారి గురించి మాట్లాడే అర్హత లేదు. ధర్నా చేస్తున్న మహిళల జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం, ఎస్మా ప్రయోగించడం, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం వంటి చర్యలు గత ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం' అని మండిపడ్డారు.

అంగన్వాడీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయబోతున్న పలు కార్యక్రమాలను మంత్రి వివరించారు. 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 20 రోజుల వార్షిక సెలవులతో పాటు మే నెలలో 15 రోజుల వేసవి సెలవులు అమలులో ఉన్నాయి. సేవలను గుర్తించేందుకు రాష్ట్ర స్థాయి అవార్డు కింద కార్యకర్తలకు రూ.50వేలు, సహాయకులకు రూ.40వేలు నగదు బహుమతి అందజేస్తున్నారు. అంగన్వాడీల ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచడమే కాకుండా వారికి గ్రాట్యుటీ కూడా చెల్లిస్తున్నాం. పీఎంజేజేబీవై కింద విధి నిర్వహణలో మరణిస్తే రూ.2 లక్షల భీమా పరిహారం అందుతుంది. మట్టి ఖర్చులకు రూ.15వేలు తక్షణ సాయం అందిస్తున్నాం.

అప్‌గ్రేడేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించాం. కొత్తగా మరో ఐదువేల మంది సహాయకులను నియమిస్తాం. గత ప్రభుత్వం ఇచ్చిన 4జీ ఫోన్లు పనికిరాకుండా పోవడంతో రూ.75 కోట్ల వ్యయంతో 50,824 మందికి 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశాము. తాగునీరు, మరుగుదొడ్ల కోసం రూ.86.68 లక్షలు, ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రల కోసం రూ.141 కోట్లు ఖర్చు చేశాము. ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న సమస్యల పరిష్కారానికి 2025 బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించాము.

2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం అంగన్వాడీల జీతాలను రూ.4,200 నుంచి రూ.10,500 వరకు రెండు సార్లు పెంచిందని మంత్రి గుర్తు చేశారు. అంగన్వాడీలు పది డిమాండ్లలో తొమ్మిందిని తమ ప్రభుత్వం పరిష్కరించిందని, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

# పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

***- డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ వ్యవస్థను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు***

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు పశుసంవర్ధక శాఖ కీలక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో పశువుల రవాణా సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ జనరేషన్ సిస్టమ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ రూపొందించిన ఈ వ్యవస్థ ద్వారా పశువుల రవాణా మరింత పారదర్శకంగా, నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇకపై పశువులను రవాణా చేయదలిచిన ప్రతి వ్యక్తి సంబంధిత పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాత మాత్రమే రవాణా చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌ను పశువుల రవాణా నిబంధనలకు అనుగుణంగా జారీ చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. రవాణా, పోలీస్ శాఖలు ఈ డిజిటల్ సర్టిఫికెట్‌ను పరిశీలించిన అనంతరం మాత్రమే పశువుల రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విధానం అమలులోకి రావడంతో పశువుల అక్రమ రవాణాపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని, అలాగే పశుసంవర్ధక రంగంలో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



### వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో

# మంత్రి దుర్గేష్ పరకాయ ప్రవేశం

- **సాంస్కృతిక కార్యక్రమంలో అదరగొట్టిన పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి**
- **ముఖ్యమంత్రి, సహచర ప్రజాప్రతినిధుల ప్రశంసల జల్లు**

విజయవాడ (చైతన్య రథం): బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశత్వాన్ని ఎదిరించి, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో విప్లవ జ్యోతిగా వెలిగిన వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ అద్భుత నటనతో అలరించారు. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన అనంతరం, శుక్రవారం సాయంత్రం విజయవాడ పట్టణం పటమటలోని ఆంత్రలాక్స్ హాల్‌లో ప్రజాప్రతినిధుల కోసం ఆంధ్రప్రదేశ్ "శాసన వ్యవస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆటవిడుపు" ఎమ్మెల్యే -ఎమ్మెల్సీ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు -2026 కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ తనదైన శైలిలో ఈ ప్రదర్శన ఇచ్చారు. కట్టబొమ్మన విశిష్ట ఆహార్యం, గంభీరమైన వాచకం, రాజసంతో మంత్రి దుర్గేష్ పాత్రలో జీవించారు. ఆయన వేదికపైకి రాగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది. ప్రదర్శనను వీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు మంత్రి దుర్గేష్ నటనను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "దేశభక్తికి నిలువెత్తు రూపం వీరపాండ్య కట్టబొమ్మన అని, పాంచాలకురిచ్చి యుద్ధంలో ఆయన చూపిన సాహసం చిరస్మరణీయమని" కొనియాడారు. అటువంటి మహనీయుడి పాత్రను పోషించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. మంత్రి కందుల దుర్గేష్ నటనా శైలి,



సంభాషణల చాతుర్యం, పుణ్యభూమి నాదేశం నమోనమామి పాటలో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, సునీల్ కుమార్ తదితర సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రదర్శించిన తీరు సభికులను మంత్రముగ్ధులను చేసింది.

### తిరుమల లడ్డూ కల్తీ మహాపాపం

# హిందూ సమాజానికి జగన్ క్షమాపణ చెప్పాలి

***దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి***

అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నిప్పులు చెరిగారు. గత ఐదేళ్ల పాలనలో టెండర్ నిబంధనలను ఇష్టానుసారంగా మార్చి కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విపక్ష వైసీపీ సభ్యులపై శుక్రవారం ఆయన శాసనమండలిలో ధ్వజమెత్తారు. నిబంధనల తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నెయ్యి సరఫరా టెండర్లలో చేసిన అక్రమాలను మంత్రి ఆనం ఆధారాలతో వివరించారు:

'నెయ్యి సరఫరాకు ఉండాల్సిన మూడు సంవత్సరాల అనుభవాన్ని కేవలం ఒక సంవత్సరానికి కుదించారు. రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాల సేకరణ ఉండాలనే కీలక నిబంధనను పూర్తిగా ఎత్తివేశారు. 2020లో టీటీడీ బోర్డు సభ్యులు, అప్పటి ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి కలిసి ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వారే కల్తీ నెయ్యి పాపానికి ప్రధాన కారకులు' అని మంత్రి ఆరోపించారు.

రిపోర్టులను తొక్కిపెట్టారు

మంత్రి తన ప్రసంగంలో సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదికను ప్రస్తావించారు. "2022లోనే నెయ్యి కల్తీ జరుగుతోందని సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదిక ఇచ్చింది. కానీ అప్పటి పాలకులు ఆ రిపోర్టును బయటకు రాకుండా తొక్కిపెట్టారు. 2022 నుంచి 2024 వరకు ఒక్కసారి కూడా నెయ్యి ట్యాంకర్లను పరీక్షించకుండానే కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు.'



**జగన్ వైఖరిపై విమర్శలు**

క్రైస్తవ మతానికి సంబంధించి ఒక చిన్న తప్పు జరిగితేనే పత్రికల్లో క్షమాపణలు చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి, రూ.235 కోట్లతో 20లక్షల కల్తీ లడ్డూలు తయారు చేసినప్పుడు హిందూ సమాజానికి ఎందుకు క్షమాపణ చెప్పడం లేదని మంత్రి ప్రశ్నించారు. ఏడుకొండలు కాదు.. రెండు కొండలే అని 2005లోనే హిందూ మత ధ్వంసానికి పూనుకున్నారన్నారు. తిరుమల వెళ్లి డిక్లరేషన్ ఇవ్వకుండానే వెనక్కి తిరిగిన జగన్, నేడు మండలి సభ్యులతో భజన చేయించుకుంటున్నారని విమర్శించారు.

'వైసీపీ పాలకులు చేసిన ఈ క్షమించరాని నేరానికి, మహా పాపానికి ఫలితంగానే ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పంతాలకు పోకుండా హిందూ సమాజానికి ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలి. వాస్తవాలు ప్రజలకు తెలియాలని, అరుపులతో వాస్తవాలను దాచలేరు' అని మంత్రి వ్యాఖ్యానించారు.

### స్వచ్ఛసర్వేక్షణ్‌లో

# మున్సిపల్ కమిషనర్లదే కీలక బాధ్యత

**వర్క్‌షాప్‌లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్**



*విజయవాడ (చైతన్య రథం): స్వచ్ఛసర్వేక్షణ్‌లో మున్సిపల్ కమిషనర్లదే కీలక బాధ్యత అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. కమిషనర్లు లీడ్‌రోల్ తీసుకోవాలని కోరారు.*

*విజయవాడలోని స్కూల్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన స్వచ్ఛసర్వేక్షణ్, సీఐటీఐఐఎస్ ఒకరోజు వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2025 జనవరిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అప్పటినుంచి ప్రతి నెల మూడవ శనివారం ఆయన ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్నారని చెప్పారు.*

*1995లోనే క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టి, దేశంలోని అందరి సీఎంలకంటే సీఎం చంద్రబాబు ముందు వరుసలో ఉన్నారన్నారు. గత ఏడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదగా 5 ప్రతిష్టాత్మక అవార్డులు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి సీఎం ఉద్దేశించిన లక్ష్యాల సాధనకు మనం అందరం కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు.*

*గత సర్వేక్షణ్‌కు, ఇప్పటి సర్వేక్షణ్‌కు కొన్ని మార్పులు వచ్చాయని, ఆ మార్పులు గమనించాలని సూచించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. గ్రౌండ్ లెవల్‌లో మనం పని చేసినప్పుడే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పడినప్పుడే లెగసీ వేస్ట్, ఫ్రెష్ వేస్ట్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం భూములు సమకూర్చడంపై కమిషనర్లు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మనం చేపట్టే రీసైక్లినింగ్, ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్, కంపోస్ట్ తయారీ... తదితర అంశాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మనం అందరం స్వచ్ఛ ఆంధ్ర టీమ్‌గా, బాధ్యతగా పని చేద్దామని పిలుపునిచ్చారు.*

*మనం నిర్వహించిన కార్యక్రమాల వివరాల డేటా అప్‌లోడ్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డేటా అప్‌లోడ్‌లో ఏమాత్రం పొరపాటు జరిగినా పెనాల్టీ మార్కులు పడతాయని తెలిపారు. రాష్ట్రంలో 123 యూఎల్‌బీలలో 75 యూఎల్‌బీలు మాత్రమే సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకున్నట్టు తెలిపారు. స్వయం సమీక్ష చాలా అవసరం అన్నారు. ఈసారి రాష్ట్రంలో 54 యూఎల్‌బీలపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. కాలనీల, మార్కెట్ కమిటీల అసోసియేషన్స్, విశ్వవిద్యాలయాల విద్యార్థులు మన కార్యక్రమాలలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన వర్క్‌షాప్‌లో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అనీల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ శాఖ జేడీలు, మునిసిపల్ కమిషనర్లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.*

# 'పల్లె ప్రగతి'లో సరికొత్త రికార్డు

- అభివృద్ధికి అద్దంపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- కుప్పానికి రూ.487 కోట్లు, నర్సీపట్నానికి రూ.312 కోట్లు మంజూరు
- నియోజకవర్గాల వారీగా ప్రగతి పుస్తకాలు విడుదల
- శాసనసభలో స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు బుక్‌లెట్ల పంపిణీ
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి.. వైసీపీ గెలిచిన 11చోట్లా భారీ కేటాయింపులు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖల్లో గత రెండేళ్లుగా జరిగిన అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్వేతపత్రం లాంటి నివేదికను విడుదల చేశారు. నియోజకవర్గాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన ప్రత్యేక బుక్‌లెట్లను శుక్రవారం ఆయన శాసనసభలో ఆవిష్కరించారు. నివేదికల తొలి ప్రతిని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు ఆయన చాంబర్‌లో స్వయంగా అందజేశారు.

రాజకీయాలకు అతీతంగా నిధుల వరద: రాష్ట్ర ప్రగతిలో రాజకీయాలకు తావులేదని నిరూపిస్తూ కూటమి ఎమ్మెల్యేలతో పాటు వైసీపీ విజయం సాధించిన 11 నియోజకవర్గాల్లో కూడా చేపట్టిన అభివృద్ధి పనులకు ఈ నివేదికలో పుస్తక రూపం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి అత్యధికంగా రూ.487 కోట్లు కేటాయించారు. ఇందులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకే రూ.110 కోట్లు కేటాయించడం విశేషం. స్పీకర్ నియోజకవర్గమైన నర్సీపట్నానికి రూ.312 కోట్లు, మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గమైన తెనాలికి రూ.168 కోట్లు మంజూరు చేసినట్టు పవన్‌కళ్యాణ్ వెల్లడించారు.

**అంకెల్లో 'పల్లె ప్రగతి' (శాఖల వారీగా విశ్లేషణ):**

పథకం/విభాగం కేటాయింపులు/సాధించిన ప్రగతి

పల్లె పండగ 1.0 రూ.4,500 కోట్లు (4,000 కి.మీ. రోడ్లు, 22,514 మినీ గోకులాలు)

పల్లె పండగ 2.0 రూ.5,715 కోట్లు (8,000 కి.మీ. రోడ్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు)

అడవితల్లి బాట రూ.1,005 కోట్లతో 1,021 కి.మీ. గిరిజన రహదారులు

జలజీవన్ మిషన్ ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటి సరఫరా పనులు

ఉపాధి హామీ (సాస్కీ) రూ.2,123 కోట్లతో 4,122 కి.మీ. రోడ్ల నిర్మాణం

గిరిజన ప్రాంతాలకు మహర్దశ: మారుమూల గిరిజన ఆవాసాలకు తొలిసారిగా రోడ్డు సౌకర్యం కల్పిస్తూ చేపట్టిన 'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా 625 ఆవాసాలకు రవాణా కష్టాలు తీరనున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, ప్రజల అవసరాల మేరకే ఈ పనులన్నీ కేటాయించినట్టు ఆయన స్పష్టం చేశారు.



పర్యావరణ హితమైన అభివృద్ధి: అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'గ్రేట్ గ్రీన్‌వాల్' ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు. మానవ-వన్యప్రాణి సంఘర్షణను నివారించేందుకు 'హనుమాన్' వంటి వినూత్న ప్రాజెక్టులు, 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పవన్‌కళ్యాణ్ వివరించారు.

# చంద్రబాబు హయాంలోనే కాపు సామాజికవర్గ అభివృద్ధి

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

అమరావతి (చైతన్యరథం): కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని, ఆయన హయాంలోనే కాపులకు మేలు కలిగేలా పథకాలు అమలవుతున్నాయని బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె స్పందిస్తూ... కాపుల సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. 2014-19 మధ్య విదేశీ విద్య కింద 1,585 మంది కాపు విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించామన్నారు. ఆ ఐదేళ్లలో రూ.153.11 కోట్లు కేటాయించగా గత వైసీపీ ప్రభుత్వం కేవలం 81 మంది కాపు విద్యార్థులకు మాత్రమే విదేశీ విద్య పథకం వర్తింప జేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 331 మంది కాపు విద్యార్థులకు విదేశీ విద్య పథకం బకాయిలు అందజేశామన్నారు. 2024-25లో కాపు సంక్షేమానికి రూ.4,440.25 కోట్లు ఖర్చు చేశామని, 2025-26లో కాపులకు రూ.5,571.48 కోట్లు కేటాయించామని తెలిపారు. 2014-19లో సీఎం చంద్రబాబు... కాపు భవనాల నిర్మాణానికి నిధులిచ్చారని, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాపు భవనాల నిర్మాణాన్ని పున: ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం కాపుల కోసం ఏడాదికి రూ.3,580 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు.

**కాపుల అభివృద్ధికి కూటమి కృషి**

కాపుల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి



చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. రూ.38.63 కోట్లతో ఆటో డ్రైవర్ల సేవా పథకం అమలు చేశామని... ఈ పథకం కింద 25,756 మంది కాపు లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిందని తెలిపారు. సముద్రంలో చేపల వేట నిషేధం భృతి పథకం కింద రూ.1.02 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ పథకం ద్వారా 511 మంది కాపులకు లబ్ధి కలిగిందన్నారు. మెగా డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్ ప్రోగ్రాం ద్వారా 639 మంది కాపు అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వగా... 54 కాపు అభ్యర్థులు టీచర్ ఉద్యోగాలు సాధించారన్నారు. కాపు నిరుద్యోగ యువతకు 50శాతం సబ్సిడీపై రాయితీ రుణాలు అందించడానికి 2025-26 బడ్జెట్‌లో రూ.217.79 కోట్ల కేటాయించామన్నారు. చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద 10,300 మంది కాపు లబ్ధిదారులను, గ్రూప్ ఎంఎస్ఎంఈ పథకం ద్వారా 130 గ్రూపులను గుర్తించామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి పథకం కింద 11,016 మంది కాపు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇప్పించామని మంత్రి సవిత చెప్పారు.

# అంతర్జాతీయస్థాయి థీమ్‌పార్కులపై దృష్టి

- శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- 'ఏపీ పర్యాటక విధానం 2024-29'తో రాయితీలు
- పెట్టుబడులను ఆకర్షించేందుకు భారీ ప్రణాళికలు
- కర్నూతలలో డిస్నీ వరల్డ్ ఏర్పాటుకు కూటమి ఓకే
- ఇన్వెస్టర్లు ముందుకొస్తే సహకరించేందుకు సిద్ధం
- తిరుపతి, విశాఖపట్నంలో ప్రాజెక్టులపై ఇన్వెస్టర్ల ఆసక్తి

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచస్థాయి వినోద సౌకర్యాలు, థీమ్‌పార్కుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ శాసనసభలో స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం కర్నూతల గ్రామంలోని 171.14 ఎకరాల విస్తీర్ణంలో డిస్నీ వరల్డ్ తరహా ప్రాజెక్టును ఏర్పాటు చేసే



ప్రతిపాదనపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిస్నీ వరల్డ్ లేదా యూనివర్సల్ స్టూడియోస్‌వంటి భారీ ప్రాజెక్టులకు రూ.35,000 కోట్లనుండి రూ.60,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రాజెక్టులను ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ సంస్థలే నిర్వహిస్తాయని, ప్రభుత్వం కేవలం భూమి కేటాయింపు, అనుమతులు, రాయితీలు మాత్రమే కల్పిస్తుందని వివరించారు. ప్రస్తుతం భారతదేశంలో పర్యాటకుల సగటు ఖర్చు చేసే సామర్థ్యం (రూ.20,000-21,000) అంతర్జాతీయ ప్రమాణాలకంటే తక్కువగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వీటిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిస్నీ వరల్డ్ మరియు యూనివర్సల్ స్టూడియోస్‌వంటివి యూఎస్ఏలోని ఓర్లాండో, లాస్ ఏంజిల్స్, జపాన్‌లోని టోక్యో, ఫ్రాన్స్‌లోని పారిస్, చైనాలోని షాంఘైవంటి మెట్రో పాలిటన్ నగరాల్లో ఉన్నాయన్నారు. వీటిఏర్పాటు డిమాండ్, సరఫరామీద ఆధారపడి ఉంటుందన్నారు. ఆయా దేశాల్లో రిటర్న్ ఉన్నాయి కాబట్టి వాటి ఏర్పాటుకు ఆస్కారం ఉందన్నారు. మన దేశంలో ఏర్పాటు చేయాలంటే పర్యాటకులరాక, వారి ఖర్చు చేసే సామర్థ్యం ఎక్కువగా ఉండాలని దుర్గేష్ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించామని, భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం రూ.40 కోట్ల వరకు, 5-10 శాతం స్థిర మూలధన పెట్టుబడి సబ్సిడీ అందిస్తుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 100శాతం స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్, 100 శాతం భూ వినియోగ మార్పిడి రుసుము మినహాయింపు, పారిశ్రామిక టారిఫ్ ప్రకారం విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ 7-15 ఏళ్ల పాటు 100 శాతం ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, 3 ఏళ్ల పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐలలో 50-100 శాతం రీయింబర్స్‌మెంట్, మెగా,అల్ట్రా-మెగా ప్రాజెక్టుల కోసం కేసు ప్రాతిపదికన ప్రత్యేక రాయితీలు ఇస్తుందన్నారు.

భారత దేశంలో ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఈ తరహా పార్కులు నిర్వహిస్తున్న ఇమాజికా, వండర్ లా వంటి సంస్థలతో పర్యాటక శాఖ చర్చలు జరుపుతోందని.. వారు తిరుపతి మరియు విశాఖపట్నంలో ప్రాజెక్టులపై ఆసక్తి చూపారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. డిస్నీ వరల్డ్ తరహా ఏర్పాటుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి హిక్సా, అరేబియన్ ట్రావెల్ మార్కెట్, ఐటీబీ బెర్లిన్, వరల్డ్ ట్రావెల్ మార్ట్ వంటి అంతర్జాతీయ రోడ్‌షోలతో పాటు ఢిల్లీలో జరిగిన సాటే( సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ టూరిజం ఎగ్జిబిషన్), హైదరాబాద్ లో జరిగిన ట్రావెల్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) వంటి జాతీయ, ప్రాంతీయ సదస్సులలో పాల్గొన్నామన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన విశాఖ భాగస్వామ్య సదస్సులో పర్యాటక శాఖ రూ. 18,448 కోట్ల విలువైన 102 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసిందని అందులో మూడు థీమ్ పార్కులకు సంబంధించినవని వివరించారు.

ప్రత్తిపాడుఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించిన కర్నూతల గ్రామంలోని స్థలంలో వీటి ఏర్పాటుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపితే సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యాటక శాఖ పనితీరుపై, మంత్రి కందుల దుర్గేష్ సమర్థతపై ఎమ్మెల్యే రామాంజనేయులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# కల్తీరాయుళ్లపై ఉక్కుపాదం

## ప్రజలు గళం విప్పాలన్న వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఆహార పదార్థాల కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. కల్తీపై కేవలం ప్రభుత్వ చర్యలే కాకుండా ప్రజలు కూడా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం శాసనసభలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, అదిరెడ్డి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఆహార తనిఖీల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి ఆరోపించారు. సిబ్బంది నియామకాలు చేపట్టకుండా, ప్రయోగశాలలను పట్టించుకోకుండా ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేశారని ధ్వజమెత్తారు. వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇటీవల సీఎం 150 కొత్త పోస్టుల భర్తీకి అనుమతించారని తెలిపారు. "2023నుంచి ఇప్పటివరకు 16,730 నమూనాలను పరీక్షించగా 1,407 నమూనాలు నాణ్యత లేనివిగా తేలాయి. చిల్లీ చికెన్‌వంటి వంటకాలతోపాటు బెల్లంలో కూడా హానికరమైన సింథటిక్ రంగులు వాడుతున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఈ రంగుల వల్ల దీర్ఘకాలంలో క్యాన్సర్‌వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది" అని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీరాయుళ్లకు ప్రస్తుతం జైలు శిక్ష తక్కువగా ఉందని, అందుకే వారిలో భయం ఉండట్లేదని మంత్రి అభిప్రాయపడ్డారు. నిబంధనలను మరింత కఠినతరం చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో చర్చిస్తామన్నారు. తిరుమల, తిరుపతి, కర్నూలు, విశాఖ, గుంటూరుల్లో అత్యాధునిక రాష్ట్రస్థాయి ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

"డార్క్ స్టోర్స్"పై ప్రత్యేక నిఘా:

ఇటీవల పెరుగుతున్న ఈ-కామర్స్, డార్క్ స్టోర్స్ (క్విక్ కామర్స్)పై ప్రభుత్వం నిఘా పెంచిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 277 స్టోర్లను ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాల ప్రకారం తనిఖీ చేస్తామని చెప్పారు. ఆహార పదార్థాల కల్తీపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. కల్తీ జరిగినట్టు గుర్తిస్తే 1800 425 3857, 18645-297215 నెంబరుకు ఫోన్ చేయాలని మంత్రి సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లువంటి బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగులు, కరపత్రాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని సత్యకుమార్ స్పష్టం చేశారు.

# 16న అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహావిష్కరణ



అమరావతి (చైతన్యరథం): ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకార్థం అమరావతిలో నిర్మించిన భారీ కాంస్య విగ్రహం ఆవిష్కరణకు ముహూర్తం ఖరారైంది. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల స్థలంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు.

**58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం**

పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం నిర్వహించిన 58 రోజుల చారిత్రాత్మక నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని 58 అడుగుల ఎత్తుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం, ట్రస్టు కలిసి పూర్తి చేశాయి. పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరు కానున్నారు. ఆయనతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దూండి రాకేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

# గండికోట నిర్వాసితులను వైసీపీ ప్రభుత్వం దగా చేసింది

**- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల**



అమరావతి (చైతన్యరథం): గండికోట రిజర్వాయర్ నిర్వాసితుల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర మోసానికి పాల్పడిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. శుక్రవారం శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన గండికోట నిర్వాసితుల పరిహారం అంశంపై వివరణ ఇచ్చారు.

చంద్రబాబు హయాంలోనే తొలి విడత పరిహారం: 2014-19 మధ్యకాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు గండికోట నిర్వాసితులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, మొదటి ఫేజ్ పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందించారని మంత్రి గుర్తు చేశారు. ఆ సమయంలోనే నిర్వాసితులకు పునరావాస పనులు వేగవంతం చేశామని తెలిపారు.

ఐదేళ్లు కాలయాపన చేసి.. ఎన్నికల ముందు జీవోలా? వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నిర్వాసితులను పట్టించుకోలేదని మంత్రి నిమ్మల విమర్శించారు. "2019-24 మధ్య నిర్వాసితులకు పెంచిన పరిహారం ఇస్తామని చెప్పి ఐదేళ్లూ కాలయాపన చేశారు. ఎలాంటి నిధులు కేటాయించకుండా, ఎన్నికలకు కేవలం కొద్ది రోజుల ముందు ఒక జీవో ఇచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని అమలు చేయమనడం వారి రాజకీయ క్రీడకు నిదర్శనం." అన్నారు.

**తప్పులను సరిదిద్దుతాం..**

గత ప్రభుత్వం నిర్వాసితులను దగా చేసిందని, వారి చేసిన తప్పిదాల వల్ల నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతుందని, నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# 'మండపేట' అభివృద్ధికి రూ.20.50 కోట్లు

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రోడ్లు అధ్వానం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రోడ్లను పూర్తిగా నాశనం చేశారని, కనీసం మరమ్మతులు కూడా చేయకుండా ఆర్అండ్‌బీ శాఖను నిర్వీర్యం చేశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

మండపేట నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితిపై మంత్రి స్పందిస్తూ... కొన్ని ప్రధాన రహదారులు పాక్షికంగా దెబ్బతిన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకపోయినా, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మండపేట నియోజకవర్గ రోడ్ల మరమ్మతులకు రూ.20.50 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. మండపేట బైపాస్, తాపేశ్వరం బైపాస్ రోడ్ల పురోగతిపై మంత్రి కీలక వివరాలు తెలిపారు:

మండపేట బైపాస్: 2017లోనే రూ.1.85 కోట్లతో భూసేకరణకు పరిపాలనా అనుమతులు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం దానిని పూర్తి చేయకుండా పనిని రద్దు చేసింది.

తాపేశ్వరం బైపాస్: ద్వారపూడి-యానాం రోడ్డులో తాపేశ్వరం వద్ద బైపాస్ నిర్మాణానికి భూసేకరణ పూర్తయింది. బడ్జెట్ లభ్యతను బట్టి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

**కడప నియోజకవర్గానికి రూ.16.79 కోట్లు**

కడప నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.16.79 కోట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. నిధుల లభ్యత ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో అన్ని దెబ్బతిన్న రోడ్లను త్వరలోనే అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

**పుష్కర నిధులతో రోడ్ల విస్తరణ**

ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ... త్వరలో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా మండపేట నియోజకవర్గానికి భారీగా నిధులు వస్తాయని గుర్తు చేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ... పుష్కరాల కోసం వచ్చే ప్రత్యేక నిధులను కూడా వినియోగించి స్థానికంగా ఉన్న రహదారులను మరింత మెరుగుపరుస్తామని సభకు హామీ ఇచ్చారు.

# మారెమ్మ అమ్మవారి ఆలయాభివృద్ధికి కృషి

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

విస్సన్నపేట (పుట్రేల) (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. పుట్రేల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం విచ్చేసిన ఎంపీ చిన్నికి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తేళ్ల శ్రీనివాసరావు, సభ్యులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎంపీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో ఉన్న డ్రైనేజీ సమస్య, ఇతర అభివృద్ధి పనులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ... ""ఎప్పటి నుంచో పుట్రేల మారెమ్మ అమ్మవారిని దర్శించుకోవాలని అనుకుంటున్నాను, ఈ రోజు ఆ భాగ్యం కలిగింది అన్నారు. ఆంధ్ర నుంచే కాకుండా తెలంగాణ నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం. డ్రైనేజీ సమస్యపై అధికారులతో మాట్లాడి వెంటనే



పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను" అని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, జిల్లా సీనియర్ నాయకుడు తాళ్లూరి రామారావు, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు నెక్కలపు శ్రీను (డాబా శ్రీను), విస్సన్నపేట మండల శాఖ అధ్యక్షుడు రాయల సుబ్బారావు, ఎన్ఆర్ఐ నాయకుడు వల్లభనేని గిరి, మారెమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తేళ్ల శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కోశాధికారి నాదెళ్ల నాగమణి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి కొత్తపల్లి ఆనంద్‌స్వరూప్, గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగె శ్రీనివాసరావు, గంపలగూడెం మండల శాఖ అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ (ఎంఆర్‌కె), విస్సన్నపేట పట్టణ శాఖ అధ్యక్షుడు కొంగల శ్రీనివాసరావు, తిరువూరు పట్టణ శాఖ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు కవులూరి రాజా, జిల్లా నాయకుడు ఆకుల రాధాకృష్ణ, తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కుక్కదపు నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కంభంపాటి బద్రీనాథ్, తెలుగు యువత మండల నాయకులు ముత్తంశెట్టి వంశీ, టీడీపీ సీనియర్ నాయకుడు ఎన్టీ వెంకటేశ్వరరావు, విస్సన్నపేట టౌన్ మాజీ అధ్యక్షుడు చిన్నోడు, తెలుగు యువత నాయకుడు రాయల కిట్టు, మాజీ ఎంపీపీ ముత్తంశెట్టి వెంకటేశ్వరరావు, తెలుగు యువత నాయకులు తుమ్మలపల్లి అనిల్, తుమ్మలపల్లి సునీల్, మాజీ ఎంపీపీ గద్దె వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కావూరి బాబు, మాజీ జడ్పీటీసీ మట్టా వేణుగోపాలరావు, టీడీపీ దళిత నాయకుడు బొద్దుకోళ్ల ప్రేమరాజు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

హిరమండలం (చైతన్యరథం): మండలంలోని కోరాడ కాలనీలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న అదనపు భవనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిసరాల పరిశుభ్రత కోసం రూ.లక్ష, పాఠశాలలో ఎలాంటి వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాల కోసం రూ.25 వేల నగదును ప్రధానోపాధ్యాయుడికి అందజేస్తామన్నారు. కలెక్టర్ వెంట జడ్పీటీసీ పి. బుచ్చిబాబు, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాణి, తదితరులు ఉన్నారు.



# ఖరీఫ్ నాటికి వంశధార ఎత్తిపోతల పథకం పనులు పూర్తి

హిరమండలం (చైతన్యరథం): ఈ ఏడాది ఖరీఫ్ నాటికి హిర మండలం వద్ద నిర్మిస్తున్న వంశధార ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. పాతపట్నం నుంచి ప్రత్యేకంగా ఒక లైన్ వేసి ఇక్కడ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎత్తిపోతల పథకం పనులకు ఉద్దానం కాగినేటి పైపు లైన్ అడ్డంగా ఉందని ఈఈ రవీంద్ర తెలిపారు. పైపు లైన్ క్రాస్ చేసే సమయంలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఉద్దానం ప్రాంతానికి ఒకటి రెండు రోజుల్లో తాగునీటిని నిలిపివేస్తే ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు.



# ప్రేమా... దయాగుణానికి ప్రతీక రంజాన్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రంజాన్ మాసం ప్రేమ... దయాగుణాలకు ప్రతీకంగా పరిగణించబడుతుందని... ఇది ముస్లింలకు పవిత్రమైన ఉపవాస కాలం, దానధర్మాలు, కరుణ, సానుభూతిని పెంపొందించే సమయమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం కోసం 1వ డివిజన్ బత్తిన నగర్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా, ముస్లిం మైనారిటీ పెద్దలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మైనారిటీల రక్షణకు, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మసీదులు, ఈద్గాలు, కబర్సాన్ల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ముస్లింల అభివృద్ధికి ఎప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధి, విద్య, ఆర్థిక పురోగతికి ప్రత్యేక పథకాలు అమలు చేయనుందని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ సోదరభావంతో కలిసి ఉండాలని పిలుపునిచ్చారు. మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం అని, తమ జీవిత సౌదాల్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింపజేసుకునేందుకు ఉపయోగపడే సాధనమే ఉపవాస వ్రత పరమార్థమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కాగా బత్తిన నగర్లో లో వోల్టేజీ సమస్య పరిష్కారం కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఐక్యతకు నిదర్శనం.. యోగా, రంగుల మధ్య మహిళా దినోత్సవ సంబరాలు..!



కాకినాడ (చైతన్యరథం): మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల మహిళలు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రంగులు జల్లుకుంటూ ఆనందంగా డాన్సులు చేస్తూ వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లాలో కూడా మహిళా దినోత్సవ వేడుకలు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. కాకినాడ జిల్లాలో జోష్ యోగ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. మహిళలు వంటింటికే పరిమితం కావాల్సిన అవసరం లేదని, జీవితంలోని ప్రతి రంగంలోనూ మహిళలు చురుకుగా పాల్గొనాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు. ఆరోగ్యం, ఆనందం, ఐక్యత అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వం ధ్యేయమని ఆమదాలవలస మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావేదికతో ప్రజా సమస్యలకు పరిష్కారం

**•టీడీపీ అరకు ఇన్‌ఛార్జ్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర**



విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అరకులోని ఆ పార్టీ అసెంబ్లీ, ఇన్‌ఛార్జ్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో తన క్యాంపు కార్యాలయంలో ప్రజా వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. నియోజకవర్గంలో అనేక గ్రామాల నుంచి తమ సమస్యలను తెలియజేసుకునేందుకు ఈ గ్రీవెన్స్‌కు ప్రజలు హాజరయ్యారు. ప్రజలు తెలియజేసే సమస్యలను వింటూ కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్ని ఆర్థిక అంశాలతో కూడిన సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. ప్రతి ఒక్కరి వినతి పత్రాలను స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ... టీడీపీ గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి వినతి పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రీవెన్స్ వచ్చిన తర్వాత చాలా సమస్యల పరిష్కారానికి నోచుకున్నాయని ఇది ఒక అద్భుత కార్యక్రమం అని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి ఈ కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం ఓ గొప్ప పరిణామం అన్నారు. ఈ ప్రజా వేదిక ద్వారా సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకోయ్ మహాదేవ్ దుంబ్రిగూడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, అరకు వ్యాలీ ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, దుంబ్రిగూడ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పాంగి సుబ్బారావు, మాజీ ఎంపిటిసి కిల్లో కుమార్, మాజీ ఎంపిటిసి వంతల వెంకటరావు, క్లస్టర్ ఇంచార్జి కొర్ర శేఖర్, క్లస్టర్ ఇంచార్జి కిల్లో మోహన్ దాస్, సిరగం పంచాయతీ అధ్యక్షుడు పూజారి మాణిక్యం, అరకు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు బురిడీ కొమ్ములు నాయుడు, బస్కీ పంచాయతీ ఉప అధ్యక్షుడు కొర్ర బాలరాజు, అరకు మాజీ సర్పంచ్ సట్టారి వెంకట్రావు, హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్ర నర్సింగరావు, టీడీపీ యువ నాయకుడు కిల్లో నాగేంద్రబాబు, మాదగడ పంచాయతీ రైతు అధ్యక్షుడు వంతల అప్పన్న, వంతల జగబంధు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులు ఉద్యాన పంటలు సాగు చేయాలి



విజయనగరం (చైతన్యరథం): అత్యధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలనే రైతులు సాగు చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భోగాపురం మండలంలో కలెక్టర్ పర్యటించారు. కొయ్యపేటలో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. పొలాల్లో దిగి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పద్ధతులు, మార్కెట్ సదుపాయం తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి స్థానంలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, పూల సాగు ద్వారా నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఉద్యాన సాగు వైపు మళ్లే రైతులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా వారు పండించిన పంటలకు మార్కెట్ సదుపాయంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తామన్నారు. అత్యధిక దిగుబడి కోసం సంప్రదాయ సాగు పద్ధతులకు బదులు ఆధునిక విధానాలను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఉద్యాన శాఖ డీడీ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి హైమవతి, ఉద్యాన అధికారి ఉమాభారతి తదితరులు ఉన్నారు.

# గొట్టిపల్లిలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆనందపురం (చైతన్యరథం): మండలంలోని గొట్టిపల్లి గ్రామ పంచాయతీలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం రూ. 25 లక్షల నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు కూటమి నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి ప్రారంభమైందన్నారు. గత ఐదేళ్లలో కనీసం ఒక రోడ్డును కూడా వైకాపా ప్రభుత్వం వేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎర్ర బంగారు నాయుడు (బన్నీ ), తమ్ము నాయుడు, తమ్మిన అప్పలరాజు, డీపీ రాజు, కోరాడ శంకర్రావు, కోరాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**●గ్రీవెన్స్ డేలో 180 అర్జీలను స్వీకరించిన పొలిట్‌బ్యూరో సభ్యురాలు సీతారామలక్ష్మి**



భీమవరం (చైతన్యరథం): ప్రజల అర్జీలను వినతి పత్రాలు పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు భీమవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ తోట సీతారామలక్ష్మి తెలిపారు. శుక్రవారం భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో ప్రజల నుంచి 180 అర్జీలను సీతారామలక్ష్మి స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నమని భీమవరం నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎఏంసి చైర్పర్సన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు మాట్లాడుతూ ఈరోజు వచ్చిన అర్జీలలో ఎక్కువ శాతం పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల గురించి వచ్చాయని ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎ.ఏం.సి మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీలను ఈ వేదిక ద్వారా తెలియజేసి లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పులూరి చంద్రశేఖర్, ఎండి షబీనా, చెరుకుపల్లి సంతోష్ కుమార్ మాజీ కౌన్సిలర్లు మైలబత్తుల ఐజాక్ బాబు విజ్జురోతు రాఘవులు తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు జిల్లా కార్యదర్శి రేవు వెంకన్న జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మాదాసు కనకదుర్గ టీడీపీ పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, భీమవరం మండల టీడీపీ అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి ప్రధాన కార్యదర్శి కోళ్ళ సీతారాం తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు గొలగాని రమేష్, ఉపాధ్యక్షుడు చెరుకు తిరుపతిరావు, క్లస్టర్ ఇంచార్జ్ కౌరు పృథ్వీశంకర్, పట్టణ కార్యదర్శి గంధం రాధా టీడీపీ నాయకులు మల్లువలస రాము నక్క గోవింద్ కాపరబాబు కోళ్ల చిన సీతారాం బొక్క శ్రీనివాస్ యలమంచిలి శ్రీనివాస్ మరపట్ల శ్యాంబాబు ఎండి ఫిరోజ్ గుల్లంకి శ్రీలక్ష్మి షేక్ రజియా బేగం నక్క గోవింద్ బొక్క శ్రీనివాస్ జవ్వాది గణేష్ తమ్మినిడి నాగేశ్వరరావు జల్లా బుజ్జి గ్రామ వార్డు అధ్యక్ష కార్యదర్శులు బూత్ ఇన్‌ఛార్జులు నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్తీని ఒక ప్రాణాంతక విపత్తుగా గుర్తించి దానిపై ఉక్కుపాదం మోపాలి

**● అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో కల్తీ ఆహార అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): ఆహార కల్తీని ఒక ప్రాణాంతక విపత్తుగా గుర్తించి, దాని పై ఉక్కుపాదం మోపాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలగపూడిలో జరుగుతున్న  అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో పెరుగుతున్న ఆహార కల్తీ సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "ఆహారమే ఔషధం" అని మన పెద్దలు చెప్పారని, కానీ నేడు అదే ఆహారం విషంగా మారుతున్న పరిస్థితిని మనం చూస్తున్నామని, లాభార్జనే లక్ష్యంగా బియ్యంలో రాళ్లు కలపడం నుండి ప్రారంభమైన కల్తీ, నేడు పవిత్ర ప్రసాదం వరకు చేరుకుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కల్తీ కారణంగా ప్రజల జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా కారణమవుతోందని పేర్కొన్నారు. కల్తీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు లేకపోవడం, సమర్థవంతమైన తనిఖీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఆహార కల్తీ విచ్చలవిడిగా పెరుగుతోందని అన్నారు. 2014-19 కాలంలో ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్ ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ 100 పాయింట్లకు 47 పాయింట్లతో 10వ స్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. ఆ పరిస్థితిని గమనించిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2018లో జీవో జారీ చేసి సిబ్బంది కొరత తీర్చేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా ఆ జీవోను అమలు చేయకపోవడంతో 2023 నాటికి ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ 100కి 22 పాయింట్లతో 28వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం, కొంతమంది సిబ్బందిని నియమించడం ద్వారా రాష్ట్రం చిట్టచివరి స్థానం నుండి క్రమంగా మెరుగుపడుతున్నదని పేర్కొన్నారు. అయినప్పటికీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఇంకా సిబ్బంది కొరత ఉందని, తనిఖీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియంత్రణ లేకుండా హోటళ్లు , చిరుతిళ్ల బండ్లు పెరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్

**● పరీక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం**



ఏపీలో పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ తెలిపింది. ఎస్ఎస్‌సీ పదోతరగతి పరీక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ పేర్కొంది. హాల్ టికెట్ చూపిస్తే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించింది. పరీక్ష జరిగే అన్ని రోజులు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ సూచించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు విద్యార్థుల సౌకర్యార్థం తగిన బస్సులు నడపాలని ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అలాగే పరీక్షా రోజుల్లో బస్ పాస్ అడగవద్దు అని సిబ్బందికి సూచించారు.

**విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం**

రాష్ట్రంలో నిర్వహించనున్న ౹ాజ పబ్లిక్ పరీక్షలు--2026కు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం సమాచారం ప్రకారం ౹ాజ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడనున్నాయి. ఈ పరీక్షలకు రాష్ట్రంలో సుమారు 6,42,555 మంది విద్యార్థులు 3,415 పరీక్షా కేంద్రాల్లో హాజరుకానున్నారు. విద్యార్థులు తమ నివాస ప్రాంతం నుండి పరీక్షా కేంద్రాలకు వెళ్లి తిరిగి రావడానికి సౌకర్యంగా ఉండే విధంగా అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు మరియు సిటీ ఆర్డినరీ బస్సుల్లో హాల్ టికెట్ చూపించిన ఆధారంగా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించబడుతుంది. విద్యార్థుల వద్ద బస్ పాస్ లేకపోయినా సిబ్బంది బస్ పాస్ కోసం అడగకూడదని సూచించబడింది. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం పరీక్షా రోజులలో మాత్రమే (16.03.2026 నుండి 01.04.2026 వరకు) అమలులో ఉంటుంది. అలాగే పరీక్షా రోజుల్లో ప్రభుత్వ సెలవులు లేదా సాధారణ సెలవులు ప్రకటించినా కూడా ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం అమల్లో ఉంటుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరీక్షా కేంద్రాలకు తగిన సంఖ్యలో బస్సులు నడపాలని సంబంధిత అధికారులకు సూచించబడింది.

## దుర్గమ్మ సన్నిధిలో కుంభాభిషేక మహోత్సవాలు

**● శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన ఆలయ పూజారాలు, అధికారులు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో 12 ఏళ్లకోసారి నిర్వహించే కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నేటి నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలి రోజు శ్రీ కనక దుర్గానగర్ ప్రవేశ ద్వారం నుంచి వేదపండితులు, అర్చకులు పవిత్ర కలశాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి చేరే 'కలశ ఉరేగింపు' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం యాగశాల, గణపతి పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ మహాకుంభాభిషేకం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్, అధికారులు పాల్గొన్నారు.

**ఇంద్రకీలాద్రికి కంచి పీఠాధిపతి రాక**

జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి శుక్రవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇంద్రకీలాద్రిపై ప్రతి 12 ఏళ్లకోసారి నిర్వహించే అత్యంత పవిత్రమైన "మహా కుంభాభిషేకం" వేడుకల్లో పాల్గొననున్నారు.

## ఆత్మ శుద్ధికి ప్రతీకగా రంజాన్ ఉపవాస దీక్ష : కేంద్రమంత్రి పెమ్మసాని



గుంటూరు (చైతన్యరథం): నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కన్నులవిందుగా జరిగింది, ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని స్వామి థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి పెమ్మసాని ఇఫ్తార్ విందులో శుక్రవారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం ఆత్మపరిశీలనకు, ఉపవాస దీక్ష ద్వారా ఆత్మశుద్ధికి, పరస్పర సహకారానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. రంజాన్ మాసం మనిషిలో సహనం, దాతృత్వం, సోదరభావం పెంపొందించే పవిత్ర సమయం అని చెప్పారు.  ముస్లిం సోదరులకు స్వయంగా ఇఫ్తార్ విందును వడ్డించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, వారితో కలిసి ఇఫ్తార్ స్వీకరించడం సోదరభావానికి నిదర్శనమని అన్నారు. సమాజంలో సామరస్యాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రని ఆయన అభినందించారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులతో లాభాలు



కురుపాం (చైతన్యరథం): రైతులు సంప్రదాయ విధానాలను వీడి, ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు వస్తాయని ఏవో నాగేశ్వరరావు అన్నారు. జాతీయ పప్పు ధాన్యాల అభివృద్ధి పథకంలో భాగంగా శుక్రవారం కురుపాం మండలం దురిబిల్లి గ్రామంలో అపరాలు పంటలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. భూసారాన్ని పెంచే అపరాలు సాగు విస్తీర్ణం, ఆధునిక పద్ధతులు, తెగుళ్ల నివారణ, సేంద్రియ సాగు తదితర అంశాలను వివరించారు. అనంతరం సూక్ష్మ పోషకాలు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**◆తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాయంలో ప్రజాదర్బార్‌లో పాల్గొన్న గద్దె అనురాధ, గద్దె క్రాంతి**

విజయవాడ (చైతన్యరథం): ప్రజాదర్బారులోని ప్రజల సమస్యలను ప్రభుత్వానికి నివేదించి తప్పకుండా పరిష్కారం చేస్తామని, ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, యువనేత గద్దె క్రాంతి చెప్పారు. పటమట అశోక్ నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారంనాడు ప్రజాదర్భార్ కార్యాక్రమం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనరాధ హజరై ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలను తీసుకున్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంటవరకు జరిగింది. అనంతరం గద్దె అనురాధ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె అనూరాధ మాట్లాడుతూ... గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, ప్రజలను అనేక రకాలుగా మోసం చేసిందని విమర్శించారు.




పేద ప్రజలకు ఇవ్వని ఇళ్లకు రుణాలు తీసుకొని వాడుకొందని, కొందరికి భూముల పట్టాలిచ్చి స్థలాలు చూపలేదని, మరికొందరికి లోతట్టు ప్రాంతాల్లో వర్షాలకు మునిగిపోయే స్థలాలను కేటాయించిందని, ఇంకా కొందరికి అమరావతిలో ఇతర సిటీల నిర్మాణానికి కేటాయించిన భూములను ప్లాటులుగా ఇచ్చిందని దుయ్యబట్టారు. ఆ లబ్ధిదారులంతా ఇప్పుడు తమ గోడు వినిపిస్తూ ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ ఛిన్నాభిన్నం చేసిందని, వాటిని సరి చేయడానికి కూటమి ప్రభుత్వానికి సమయం వెచ్చిస్తూ అటు అభివృద్ధి, సంక్షేమం చేస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్‌గా అమలు చేస్తోందని కొనియాడారు. ఇంకా సమస్యలుంటే, వాటిని ప్రజారద్బార్లో నివేదిస్తే తాము ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపుతామని గద్దె అనరాధ చెప్పారు. కనక ప్రజాదర్బార్‌ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ విధంగా నాయకులంతా కృషి చేయాలని సూచించారు.

# మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

**◆ ఆంధ్రప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు**

గుంటూరు (చైతన్యరథం): మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ మరియు ది రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ వైద్య బృందం మరియు ది రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం గుంటూరు నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయి రాజశేఖర్ కాసుల, అచ్చంశెట్టి అన్వేష్ కుమార్, టి.రామలక్ష్మిలు మాట్లాడుతూ... ఈ వైద్య శిబిరం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో అనుభవిజ్ఞులైన సూపర్ స్పెషాలిటీ వైద్యులు పాల్గొని వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న ప్రజలకి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రక్తపోటు షుగర్ ఈసీజీ మొదలగు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడం జరుగుతుందన్నారు. ది రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గల్లా మురళీకృష్ణ మాట్లాడుతూ...




సమాజంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య అవగాహన మరియు ఆరోగ్య సంరక్షణ కలిగించేందుకు విస్తృతంగా గ్రామీణ ప్రాంతాలలో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమైనది అని తెలిపారు. దానిలో భాగంగా మార్చి 8వ తేదీ ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేబ్రోలు మండలము వేజెండ్ల గ్రామమునందు ప్రైమ్ హాస్పిటల్స్ గుంటూరు వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయటమైనదని ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు మరియు జనరల్ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని అవసరమైన వారికి ఈసీజీ, ఈకో, పాప్ స్మియర్, సిఏ 125, పిఎస్ఏ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలకు అవసరమైన వారికి ప్రైమ్ హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్, ఎల్ఓసి, సిఎంఆర్ఎఫ్, పథకాల ద్వారా ఉచితంగా వైద్య సేవలు మరియు అతితక్కువ ఖర్చుతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందజేస్తారని తెలిపారు. చేబ్రోలు మండల ప్రజలందరూ కూడా ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ఆరోగ్య వైద్య సేవలు పొంది సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ప్రైమ్ హాస్పిటల్స్ వైద్యులు మరియు రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం



పెదకూరపాడు (చైతన్యరథం): నియోజకవర్గంలోని అభ్యుదయకాంక్షి పారిశ్రామిక వేత్తలకు మార్గనిర్దేశం చేయాలనే ఉద్దేశంతో ఒకరోజు ఎంఎస్ఎంఈ అవగాహన శిబిరం నిర్వహించేందుకు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చైనారాజు గుడిపూడి కలిసి ముందడుగు వేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర MSME, SERP, NRI ఎంపవర్‌మెంట్ & రిలేషన్స్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారికంగా విడుదల చేశారు. ఈ MSME అవగాహన శిబిరం 2026 మార్చి 23న పెదకూరపాడులో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతంలో MSME రంగాన్ని బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలు, సబ్సిడీలు మరియు ఇతర సహాయ కార్యక్రమాలపై పారిశ్రామిక వేత్తలు మరియు పెట్టుబడిదారులకు అవగాహన కల్పించడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యం. ఈ శిబిరం ద్వారా వ్యాపారం స్థాపన, ఆర్థిక సహాయం పొందడం, సాంకేతికత వినియోగం, మార్కెట్ అనుసంధానం, మరియు అవసరమైన నిబంధనలపై పారిశ్రామిక వేత్తలకు మార్గదర్శనం అందించబడుతుంది. వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొని వ్యాపారం ప్రారంభం నుంచి అమలు, విస్తరణ మరియు మార్కెట్‌లో స్థిరపడే వరకు అవసరమైన సమగ్ర సమాచారం మరియు సహాయాన్ని అందించనున్నారు. దీని ద్వారా పల్నాడు జిల్లాలో బలమైన మరియు సమగ్ర మీవీజు వ్యవస్థను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యల పరిష్కారానికి పెద్దపీట

**●తిరువూరు విస్సన్నపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ కేశినేని శివనాథ్ శ్రీకారం**

విస్సన్నపేట (చైతన్యరథం): ప్రజలకు అత్యవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యల పరిష్కారంకు పెద్దపీట వేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు అరిగే శ్రీనివాసరావు నివాసం వద్ద ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావలదేవదత్‌తో పాటు ఇతర నాయకులతో కలిసి గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఎంపీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మంచినీటి ప్లాంట్లు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే మంచినీటి ప్లాంట్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీ చెప్పారు. వేసవి రానుండటంతో తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని, వాటర్ ప్లాంట్లు గ్రామస్తులు కోరిన చోట ఏర్పాటు చేయిస్తామన్నారు. అదే విధంగా విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్‌లను ఏర్పాటు చేయించాలని రైతులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్‌ల కోసం రెండేళ్ల క్రితమే నగదును విద్యుత్తు శాఖ అధికారులకు చెల్లించామని, అయినా ట్రాన్స్ ఫార్మర్‌ల ఏర్పాటులో జాప్యం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎంపీ శివనాథ్‌కు వివరించారు.



### దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తుందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విస్సన్నపేట మండల టిడిపి కార్యాలయం వద్ద విస్సన్నపేటకు చెందిన షేక్ మస్తాన్, కుక్కల జోజిబాబు అనే ఇద్దరు దివ్యాంగులకు తన సొంత నిధులతో ట్రై సైకిళ్లను టీడీపీ నాయకులతో కలసి ఎంపీ శివనాథ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... దివ్యాంగులకు మనోధైర్యంను పెంచేలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులైన దివ్యాంగులకు అందరికీ ప్రతి నెలా సామాజిక పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఎవరైనా అర్హులకు పింఛన్లు అందక పోతే అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

### మామిడి రైతులకు ప్రభుత్వం తోడ్పాటు

మామిడి రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా తోడ్పాటునందిస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విస్సన్నపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మామిడి ఎక్స్‌పోర్టు దుకాణంను శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మామిడి సాగు గురించి ముందుగా తెలుసుకున్న ఎంపీ, మామిడి ధరలు ఈ ఏడాది ఏ విధంగా ఉన్నాయో వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. మామిడి సాగులో ఉద్యానవనశాఖ సూచనలను రైతులంగా పాటిస్తే సాగు బాటుందని అన్నారు. మామిడి సాగు క్రమంలో కాయకు ఫ్రూట్ కవర్ వేయడం ద్వారా చీడపీడల నుంచి విముక్తి లభించి కాయ నాణ్యంగా పెరుగుతుందని, రైతులకు మంచి ధర లభిస్తుందన్నారు. పార్లమెంట్ లో తాను ఫ్రూట్ కవర్ల జీఎస్టీ, సబ్సిడీ అంశం ప్రస్తావించటం వల్లే కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీకి అందిస్తుందన్నారు.

# మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎకో పార్క్‌లో ట్రెక్కింగ్ ఫెస్టివల్

మంగళగిరి (చైతన్యరథం): ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి ఎకో పార్కులో ట్రెక్కింగ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు వీ వైబ్ ఈవెంట్స్ ఫౌండర్ రాగవీణ తెలిపారు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, స్పోర్ట్స్ ఆధారిటీ ఆఫ్ ఏపీల సహకారంతో ఈవెంట్ నిర్వహణ జరగనున్నదని, ఈ ట్రెక్కింగ్ ఫెస్టివల్‌లో 350 మంది పాల్గొననున్నారని, 8వ తేదీ ఉదయం 6 గంటలకు యోగ కార్యక్రమంతో కార్యక్రమం మొదలు కానుందని, కార్యక్రమం అనంతరం పాల్గొన్నవారికి మెడల్స్, సర్టిఫికెట్ ప్రధానోత్సవ కార్యక్రమం అతిథుల చేతుల మీదగా జరగనున్నదని రాగవీణ తెలిపారు.



# శ్రీవారి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తా

## టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ముద్దాడ రవిచంద్ర







తిరుమల (చైతన్యరథం): తితిదే ఈవోగా ముద్దాడ రవిచంద్ర శుకవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన తితిదే పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేయగా అదనపు ఈవో స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఈవో రవిచంద్ర మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. భక్తుల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను స్వయంగా పరిశీలించి, వారికి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.




యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి బాబు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అర్జీల రూపంలో అర్జీదారుల నుండి తీసుకున్నారు . ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.




# శ్రీకాళహస్తికి పెరుగుతున్న భక్తుల రద్దీ






## వసతి సౌకర్యాల మెరుగుదలకు అధికారుల బృహత్ ప్రణాళిక

శ్రీకాళహస్తి (చైతన్యరథం): వారాంతం, ప్రధాన రోజుల్లో వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మహాశివరాత్రి పర్వదినాన స్వామి, అమ్మవార్ల దర్శనాలకు తరలివచ్చిన భక్తుల సంఖ్య 1.29 లక్షలు. ఫిబ్రవరి నెలలో దర్శనాలు చేసుకున్నవారు 7.89 లక్షలకు పైమాటే ఇలా ఏటా ముక్కంటీశుని దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా అందుకు తగ్గ వసతుల కల్పన జరగడం లేదు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాయి. మళ్లీ వచ్చే ఏడాది వరకు ప్రధానమైన ఉత్సవాలు లేవు మరి. దీనికి తోడు నూతన ఈవోగా బి.కె. వెంకటేశులు బాధ్యతలు తీసుకున్నారు. ఉత్సాహవంతులైన ఎమ్మెల్యే, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సభ్యులున్నారు. వీరు వసతులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. యాత్రికులు సతమతమైపోతున్నారు. రాహు, కేతు పూజలతో ప్రాశస్త్యాన్ని సంతరించుకున్న ఇక్కడి క్షేత్రానికి.. ఆ పూజల కోసమే అధిక మంది వస్తున్నారు. పూజా టికెట్ల కోసం, మండపాలకు వెళ్లేందుకు. పూజలు అయ్యాక మళ్లీ దర్శనం కోసం క్యూలైన్లల్లో గంటల సమయం నిరీక్షించాల్సిన పరిస్థితి. రద్దీ రోజుల్లో సామాన్య భక్తుడు ఐదారు గంటల పాటు క్యూలైన్లల్లో నిలబడి ఉండాల్సిందే. ఎక్కడా ఇలాంటి క్యూసముదాయాలు లేవు. కనీసం క్యూలైన్లల్లో కూర్చొనేందుకు వీల్లేని పరిస్థితి. దీనికి తోడు చాలా వరకు ఉపవాసాలతో పూజలు చేయించుకోవడం, దర్శనం పూర్తయ్యేలోపు ఆలయంలో స్పృహ తప్పడం ఇక్కడ సర్వ సాధారణంగా ఉంది. వీటిని సరిదిద్ది మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పాలకవర్గం, అధికారులపై ఉంది.

# ఓవర్ హెడ్ ట్యాంక్‌తోనే తాగునీటి సమస్యకు పరిష్కారం

## బోరును ప్రారంభించిన యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు



దోర్నాల, (చైతన్యరథం): జల్ జీవన్ మిషన్ (హర్ ఘర్ జల్) పథకం ద్వారా మార్కాపురం జిల్లాలోని ప్రకాశం పశ్చిమ ప్రాంతానికి 1290 కోట్ల వ్యయంతో అమలు అవుతున్న త్రాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌లో భాగంగా దోర్నాల మండలం, చింతల అగ్రహారం గ్రామంలో 14 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, ఇటీవల జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో చింతల అగ్రహారం ఎస్సీ పాలెం గ్రామస్తులు తాగునీటి సమస్యను వివరించి బోరు మంజూరు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన గూడూరి ఎరిక్షన్ బాబు ఆ ఎస్సీ పాలెంకు బోరు మంజూరు చేసి, శుక్రవారం ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.

# అగ్నిపేటలో రంజాన్ ఇఫ్తార్ విందు

నెల్లూరు నగరంలోని 47డివిజన్‌లో అగ్నిపేట ప్రాంతంలో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ ఆహారం పంపిణీ చేశారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మైనారిటీ అధ్యక్షులు ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో డాక్టర్ గణేష్ కుమార్, జవారిపోతివాల్ శేఖర్ సింగ్, ఇతర రాజకీయ నాయకుల సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మార్గదర్శకత్వంలో 47వ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్ తన బృందంతో కలిసి ముస్లిం సోదరులకు సంప్రదాయ ఇఫ్తార్ ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ ప్రెసిడెంట్ ఖలీల్, ముతవల్లి సజీద్ భాయ్, షఫీ, యూనిట్ ఇన్‌చార్జ్ అధంకి చంద్రశేఖర్, బూత్ ఇన్‌చార్జీలు కంచి కృష్ణ, నీలకంఠం మునికృష్ణ, వీరమల్లు చంద్ర, కల్వకుంట సుదచిలకపాటి మధు, కంచి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబు

## ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ఒంటిమిట్ట (చైతన్యరథం): ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి, శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులకు సూచించారు. ఒంటిమిట్ట తితితే అతిథి గృహంలో తితిదే జేఈవో వి. వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, అధికారులతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 26న అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమై, మార్చి 27న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని తెలిపారు. ఏప్రిల్ 1న జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. తితితే జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, గ్యాలరీలు, పార్కింగ్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ, అంబులెన్స్ సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, పుష్పాలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.



# కడప వైసీపీ ఖాళీ

కడప (చైతన్యరథం): కడపలో వైకాపాకు షాక్ల మీద షాక్ లు తగులుతున్నాయి. కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. తాజాగా ఆ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సమయంలోనే మరో కార్పొరేటర్ కుటుంబ సభ్యులతో సహా సైకిలెక్కారు. చిన్నచౌకులో అత్యంత కీలకమైన ఐదో డివిజన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బండి జయమ్మ తన భర్త ప్రసాద్ కలిసి ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో గురువారం తెదేపా కండువా కప్పుకొన్నారు. కడప నగరపాలక సంస్థగా అవతరించినప్పటి నుంచీ బండి కుటుంబీకులు ఐదో డివిజన్కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ జిల్లా పర్యటనకు వచ్చిన రోజే కార్పొరేటర్లు ఆ పార్టీని వీడుతున్నారు. జగన్ ఫిబ్రవరి 27న పులివెందుల పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో చిన్నచౌకుకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు సీఎం చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరారు. తాజాగా జగన్ ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇప్పుడు కూడా చిన్నచౌకుకు చెందిన మరో కీలక కార్పొరేటర్ తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఇలా. ఇప్పటి వరకు వైకాపాను వీడి తెదేపాలో చేరిన కార్పొరేటర్ల సంఖ్య ఏడుకు చేరింది. మరో ఇద్దరు కూడా నాయకులతో ఇప్పటికే చర్చలు పూర్తి చేశారని.. ఇంకో ఇద్దరు మాటలు సాగిస్తున్నారని సమాచారం. నగరంలోని చిన్నచౌకు పరిధిలో మొత్తం 14 డివిజన్లున్నాయి. అందులో ఇప్పటికి ఏడుగురు వైకాపాను వీడారు. మరో నలుగురు మారడానికి సిద్ధం అయ్యారు. ఈ పరిణామాలతో చిన్నచౌకులో వైకాపా ఖాళీ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ పార్టీ నేతల మధ్య నెలకొన్న విభేదాలతో విసిగి వేశారి పలువురు వీడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చిన నేపథ్యంలో కడపలో వైకాపా బలహీన పడుతుండటం ఆ పార్టీ నేతలను కలవర పరుస్తోంది.

# మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులిస్తా

## ఎమ్మెల్యే కాలువ విజ్ఞాపనపై స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు



రాయదుర్గం (చైతన్యరథం): అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి రూ.4 కోట్లు, కణేకల్లు సబ్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడ్ని కోరారు. మిర్చి, శనగలు, చింతపండు, కందులు తదితర వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ మార్కెట్ యార్డు చైర్మన్ యు. హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

# సాలగ్రామ రూపంలో స్వామివారు



పెనుమూరు (చైతన్యరథం): కలియుగంలో ప్రజలను హింసించిన కలి పురుషుడిని పాతాళానికి తొక్కిన కొండే పెనుమూరు, పూతలపట్టు మండలాల సరిహద్దులోని కలిగిరికొండ. ఈ కొండపై స్వామివారు సాలిగ్రామం రూపంలో వెలిశారు. తరువాత ప్రజలు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారు. స్థలపురాణం ప్రకా రం... భృగుమహర్షి మహావిష్ణువు వక్షస్థలంపై తన్నడంతో అలిగిన మహాలక్ష్మి భూలోకం చేరుతుంది. ఆమెను వెతుక్కొం టూ మహావిష్ణువు ఇక్కడకు వస్తారు. మహాలక్ష్మి కోసం ఇక్కడి కొండపై ఘోర తపస్సు చేస్తారు. ఆమె కనిపించకపోవడంతో నిరాశ చెందుతాడు.. ఇంతలో కలిపురుషుడు అనే రాక్షసుడు భూలోకం మొత్తాన్ని రాక్షస రాజ్యంగా మార్చాలన్న ఉద్దేశంతో మానవులను హింసిస్తుంటాడు. దీంతో మానవులు కలి పురుషుడి బారి నుంచి తమను కాపాడాలని స్వామివారిని వేడుకొంటూరు.కలి పురుషుడు శివుని ద్వారా తనను ఎవరు తాకినా వారు భస్మం కావడమే కాకుండా తనలాగా నల్లగా మారిపోవాలని వరం పొంది ఉంటాడు. భక్తుల కోరికను మన్నించిన స్వామివారు కలి పురుషున్ని ఈ కొండకు రప్పిస్తారు. అతన్ని తాకకుండా అతని తలపై రాతి బండను ఉంచి తన ఎడమ కాలితో పాతాళానికి తొక్కి సంహరిస్తాడు.కలి అంటే కలిపురుషుడు, గిరి అంటే కొండ. రెండు కలిసి కలిగిరికొండగా పేరు. పొందింది. ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి పాదముద్రను దర్శించుకుని పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారి పాదముద్రను దర్శించుకుంటే కలి బాధలు తీరుతాయని భక్తుల నమ్మకం.

# మూగ జీవాలకు తాగునీటి సౌకర్యం

మైదుకూరు (చైతన్యరథం): మార్చి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. దీంతో నీరు అందుబాటులో లేక అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు విలవిలాడే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు యువకులు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు తమవంతు ప్రయత్నిస్తున్నారు. ఇందుకుగాను వన్యప్రాణులకు నేస్తం సేవ సంస్థగా ఏర్పడి మైదుకూరు మండలం మిట్టమానుపల్లె- బి.మఠం వెళ్లే దారి, ముదిరెడ్డిపల్లె- మల్లేపల్లె మధ్య ఆటవీ ప్రాంతంలో కార్యకలాపాలు చేపడుతున్నారు. ఆర్బీ వెంకటరెడ్డి వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఆటవీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా తొట్టెలను ఏర్పాటు చేశారు. తరచూ ద్విచక్ర వాహనాలపై ఆయా ప్రాంతాలను సందర్శించి నీటితో నింపుతున్నారు. దీంతో పక్షులు, ఇతర వన్యప్రాణులు దప్పిక తీర్చుకుంటున్నాయి. గత పదేళ్లుగా ఈ తరహా సేవ చేస్తున్నట్లు యువకులు తెలిపారు. అయితే కొందరు అకతాయిలు తొట్టెలను ధ్వంసం చేస్తుండటం.. మరికొందరు తీసుకెళ్తుండటం ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. అయినా దాతల సహాయంతో తిరిగి సమకూర్చుకుని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



# అవగాహనతోనే మహిళలు, బాలికలకు భద్రత

కలసపాడు (చైతన్యరథం): వైఎస్సార్ జిల్లా కలసపాడులోని పోలీస్ స్టేషన్లో లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం ఎస్సై సుభాన్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాల విద్యార్థులను పోలీస్ స్టేషనుకు ఆహ్వానించారు. ఎస్సై సుభాన్, పోలీసులు పోలీస్ స్టేషన్లోని విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టేషన్లోని ఎస్ఐఆర్, పలు రికార్డులు, తుపాకీ, ఖైదీలను ఉంచే లాకప్ గదులను విద్యార్థులకు చూపించారు. సైబర్ క్రైమ్, మహిళలు, బాలికల భద్రతపై వివరించారు.



# కంతేరు నుంచి క్యాస్‌టెక్ ఛైర్మన్ దాకా...



- ప్రవాసాంధ్ర పారిశ్రామికవేత్త శ్రీధర్ పాటిబండ్ల ప్రస్థానం
- ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో జైత్రయాత్ర
- టెక్నాలజీ అనుసంధానంతో అమెరికా, ఆంధ్రాల్లో ప్రాజెక్టులు

(చైతన్యరథం-అమరావతి)

**ఏ దేశమేగినా ఎందు కాలిడినా... ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా... పొగడరా నీ తల్లి భూమి భారతిని... నిలుపరా నీ జాతి నిండు గౌరవము... అన్న ప్రముఖ కవి రాయప్రోలు సుబ్బారావు దేశభక్తి గేయాన్ని ఆచరణలో చూపుతూ విజయవంతంగా ముందుకు సాగుతున్నారు ప్రముఖ ప్రవాసాంధ్ర పారిశ్రామికవేత్త పాటిబండ్ల శ్రీధర్. గుంటూరు సమీపంలోని కంతేరులో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన శ్రీధర్... వ్యాపార రంగంలో ఇంతింతై వటుడింతై అన్న చందంగా అత్యున్నత శిఖరాలకు చేరుకున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో మాస్టర్స్ పూర్తిచేసిన శ్రీధర్ ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని అమెరికా వెళ్లారు.**

### పదేళ్లలోనే విజయవంతమైన పారిశ్రామికవేత్తగా...

అక్కడి పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేశాక మిత్రులతో కలిసి క్యాస్‌టెక్ పేరుతో ఐటీ కంపెనీని స్థాపించిన శ్రీధర్... కేవలం పదేళ్లలో ఆ కంపెనీని 100 మిలియన్ డాలర్ల టర్నోవర్ కు తీసుకెళ్లారు. ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో విజయవంతమైన ప్రాజెక్టులను అమలుచేస్తూ బిలియనీర్‌గా ఎదిగారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో స్టాఫింగ్, ఇంటిగ్రేషన్, మేనేజ్డ్ సర్వీసెస్, ప్రొడక్ట్ సర్వీసెస్ ప్రాజెక్టులను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. శ్రీధర్ ఛైర్మన్, సీఈవోగా వ్యవహరిస్తున్న క్యాస్ టెక్ (KASTECH) కంపెనీ టెక్సాస్ (యూఎస్ఏ) కేంద్రంగా పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లో ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లకు సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తోంది. ఈఆర్‌పీ, క్లౌడ్ హోస్టింగ్, సైబర్ సెక్యూరిటీలలో ప్రత్యేకత కలిగిన ఈ కంపెనీలో... ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1,400 మందికి పైగా ఐటీ నిపుణులు పని చేస్తున్నారు.

### టెక్నాలజీ అనుసంధానంతో రియల్ ప్రాజెక్టులు

విజన్, టీమ్‌వర్క్, విభిన్నమైన ఆలోచనలతో అమెరికా, భారత్‌ల్లో శ్రీధర్ చేపట్టిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు ఆ రంగంలో సరికొత్త ఒరవడి సృష్టిస్తున్నాయి. హూస్టన్ హైట్స్‌లో సింగిల్ ఫ్యామిలీ హోమ్‌ల నుంచి సీలీలో 75 యూనిట్ల మల్టీ-ఫ్యామిలీ ప్రాజెక్ట్ వరకు నిర్ణీత సమయంలో పూర్తిచేయడమే గాక తక్కువ బడ్జెట్‌తో కస్టమర్లకు అందించడం శ్రీధర్ ప్రత్యేకత. టెక్సాస్ రాష్ట్రంలోని ఫుల్‌షియర్, మాన్వెల్, బ్రూక్‌షియర్, సీలీ, వుడ్‌ల్యాండ్స్, లీండర్, హార్స్‌షూ బే, మార్బుల్ ఫాల్స్, జారెల్, జోన్‌టౌన్ నగరాల్లో వ్యూహాత్మక స్థానాల్లో వ్యూహాత్మంగా భారీ ల్యాండ్ పార్శిళ్లను కొనుగోలు చేశారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు టెక్నాలజీని అనుసంధానించి పలు ప్రతిష్టాత్మకమైన స్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ ప్రాజెక్టులను చేపట్టారు.







### అమెరికా వెళ్లినా సొంతగడ్డపై మమకారం

సరికొత్త ఆలోచనలతో శ్రీధర్ చేపట్టిన ప్రాజెక్టులు ప్రస్తుతం 2 బిలియన్ డాలర్ పెట్టుబడుల మార్కును అధిగమించాయి. అమెరికాలో ఎంత ఎత్తుకు ఎదిగినా శ్రీధర్ పుట్టినగడ్డపై మమకారం వదల్లేదు. అమెరికా ప్రాజెక్టులను విజయవంతంగా కొనసాగిస్తూనే స్వదేశానికి వచ్చిన శ్రీధర్ కేబీపీ డెవలపర్స్ (KBP Developers) పేరుతో అమరావతి రాజధాని పరిధిలోని కాజ, పర్ణశాలల్లో ట్రైసిటీ, సన్నీశాండ్స్ పేరుతో భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను చేపట్టారు. ఒకవైపు వ్యాపారరంగంలో దూసుకుపోతూనే తన తండ్రి శ్రీరామ్మూర్తి ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. బిలియనీర్‌గా మారినా కుటుంబ విలువలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ చిన్ననాటి స్నేహితులతో నిరాడంబర జీవితం గడుపుతున్న శ్రీధర్... నేటి తరం ఔత్సాహిక యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

## 'మాటా' ఆధ్వర్యంలో 21న కాన్సుల్ జనరల్ రమేష్‌బాబు లక్ష్మణన్‌తో వర్చువల్ మీట్

అట్లాంటా: మన అమెరికా తెలుగు సంఘం (మాటా) ఆధ్వర్యంలో అట్లాంటాలోని భారత కాన్సుల్ జనరల్ రమేష్‌బాబు లక్ష్మణన్‌తో ప్రత్యేక వర్చువల్ మీట్-గ్రీట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఆన్‌లైన్ సమావేశం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా భారతీయ ప్రవాసులు ఆరోగ్య సంరక్షణ, సాంకేతికత, విద్య, వ్యాపారం సామాజిక సేవా రంగాల్లో చూపుతున్న ప్రతిభ, యువ నాయకత్వంపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. ఇందులో భాగంగా పాస్‌పోర్ట్, ఓసీఐ కార్డులు, వీసాలు, భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ సేవలపై తాజా సమాచారాన్ని కాన్సులేట్ అధికారులు వివరిస్తారు. భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతున్న



తీరు, స్టార్టప్‌లు, ఏఐ తయారీ రంగాల్లో వస్తున్న అవకాశాలపై చర్చ జరుగుతుంది. ప్రవాస భారతీయులు పెట్టుబడులు, మెంటార్‌షిప్ ద్వారా మాతృభూమికి ఎలా సహకరించవచ్చో ఈ వేదికపై వివరిస్తారు. చివరగా జరిగే క్వశ్చన్ అండ్ ఆన్సర్ సెషన్‌లో పాల్గొనేవారు నేరుగా కాన్సుల్ జనరల్‌తో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. సమావేశానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అట్లాంటా 'మాటా ప్రతినిధులను (లేదా) అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి నూతన కార్యవర్గం

హ్యూస్టన్: హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి (TCA) తన 50 ఏళ్ల ఘనమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ సంబరాల్లో (1976-2026) అడుగుపెట్టింది. ఈ సందర్భంలో 2026-27 సంవత్సరానికి నూతన ఎగ్జిక్యూటివ్ బోర్డు ట్రస్టీలను పరిచయం చేసింది. గత ఐదు దశాబ్దాలుగా తెలుగు





భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో ఈ సమితి అగ్రగామిగా నిలుస్తూ వస్తోంది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా యాదగిరి రెడ్డి కుడుముల బాధ్యతలు స్వీకరించగా రామకృష్ణ గొడవర్తి జనరల్ సెక్రటరీగా, జయశ్రీ బొందు కోశాధికారిగా నియమితులయ్యారు. వీరితో పాటు స్నేహలత చిర్ర (కల్చరల్ సెక్రటరీ), వాణి దూడల (వెబ్-కమ్యూనికేషన్స్), మైథిలి చాగంటి (లిటరసీ సెక్రటరీ), నగేష్ సూరెడ్డి (స్పోర్ట్స్-స్పెషల్ ప్రాజెక్ట్స్) వివిధ విభాగాల్లో సేవలందించనున్నారు. బోర్డ్ ఆఫ్ ట్రస్టీలుగా దామోదర్‌రెడ్డి జమిలి, ఉష రంగరాజ్, ఆశాజ్యోతి దేవకీ బాధ్యతలు చేపట్టారు. 'మన సంస్కృతి-మన ఆత్మ-మన భాష-మన గౌరవం' నినాదంతో ఈ స్వర్ణోత్సవ ఏడాదిని మరింత వైభవంగా నిర్వహించాలని నూతన నాయకత్వం సంకల్పించింది.

## ఫిలడెల్ఫియాలో జూన్ 20న భద్రాచల సీతారాముల కల్యాణం

పెన్సిల్వేనియా: మన అమెరికా తెలుగు సంఘం (మాటా) తన రెండో కన్వెన్షన్‌లో భాగంగా శ్రీసీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనుంది. ఈ ఆధ్యాత్మిక వేడుక జూన్ 20వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పెన్సిల్వేనియాలోని గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్లో జరుగుతుంది. భద్రాచలం దేవస్థానం నుంచి విచ్చేసే అర్చకస్వాములు పవిత్ర విగ్రహాలకు వేదోక్తంగా కల్యాణాన్ని, పట్టాభిషేక క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. భక్తులకు భద్రాచలం నుంచి తీసుకువచ్చిన పవిత్ర ప్రసాదం అక్షింతలు (తలంబ్రాలు) అందజేస్తారు. అంతే కాకుండా రామసేతు వంతెనలోని పవిత్రమైన రామశిల దర్శనం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఆధ్యాత్మిక చింతనతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగే ఈ చారిత్రాత్మక వేడుకలో ప్రవాస భారతీయులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని సీతారాముల ఆశీస్సులు పొందాలని మాటా కార్యవర్గం కోరింది. హాజరుకాగోరు భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.





## టాంపా బే ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న ఉగాది వేడుకలు

టాంపా: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు అసోసియేషన్ ఆఫ్ ఫ్లోరిడా టాంపా బే ఆధ్వర్యంలో టాంపాలోని ఇండియా కల్చరల్ సెంటర్లో ఏప్రిల్ 18న ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. నూతన సంవత్సరానికి ఆనందోత్సాహాలతో స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేస్తున్న ఈ సంబరాల్లో పంచాంగ శ్రవణం ద్వారా కొత్త ఏడాది ఫలితాలను, విశేషాలను వివరిస్తారు. చిన్నారులు, యువతీ, యువకులకు డ్యాన్స్ ధమాకా పేరుతో ఉత్సాహభరితమైన నృత్య పోటీలు నిర్వహిస్తారు. వీటితో పాటు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, మరెన్నో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించే ఈ వేడుకల్లో ప్రవాస తెలుగువారందరూ కుటుంబసమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



చైతన్యరథం

# జనగణనకు ప్రగతి, వికాస్ చిహ్నాలు

## ఆవిష్కరించిన హోంమంత్రి అమిత్ షా



కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న 2027 జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగంగా హోంమంత్రి అమిత్ షా గురువారం ప్రగతి, వికాస్ పేరుతో రెండు జనగణన చిహ్నాలను ఆవిష్కరించారు. స్త్రీ, పురుష జనగణకులను ప్రతిబింబించేలా వీటిని రూపొందించారు. "ఈ చిహ్నాలు 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో స్త్రీ, పురుషుల సమాన భాగస్వామ్యానికి ప్రతీకలు. వీటి ద్వారా జనగణన-2027కు సంబంధించిన కీలక లక్ష్యాలను, సమాచారాన్ని సమాజంలోని ప్రతివర్గానికీ చేరవేస్తాం" అని అధికారిక ప్రకటన పేర్కొంది. 2027 జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన సమాచారాన్ని వీటి సాయంతో ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేస్తారు. తొలిసారి డిజిటల్ రూపంలో సేకరించనున్న లెక్కల కోసం సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సీడాక్) రూపొందించిన డిజిటల్ సాధనాలను కూడా అమిత్ ఈ సందర్భంగా విడుదల చేశారు. ఉపగ్రహ దృశ్యాల సాయంతో డిజిటల్ మ్యాపింగ్‌కు సహాయపడే హౌస్లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ (హెచ్ఎల్బీసీ)తో పాటు గృహ జాబితా సమాచారాన్ని సేకరించి అప్లోడ్ చేసేందుకు ఉపయోగపడే ఆఫ్లైన్ మొబైల్ యాప్.. 'హెచ్ఎల్ఏ'ను హోం మంత్రి ప్రారంభించారు. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్ఈ) పోర్టల్ను, జనగణనకు సంబంధించిన పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్మెంట్ మానిటరింగ్ సిస్టంను కూడా అమిత్ ఆవిష్కరించారు. జనాభా లెక్కల సేకరణలో తొలి దశ అయిన హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ వచ్చేనెల 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండో దశ అయిన జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం 2027 ఫిబ్రవరిలో మొదలు పెట్టి మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకల్లా పూర్తిచేస్తారు.



# కూలిన సుఖోయ్ యుద్ధ విమానం

## సిందూర్‌లో పాల్గొన్న పూర్వేశ్ సహా ఇద్దరు పైలట్లు మృతి

వాయుసేనకు చెందిన సుఖోయ్ యుద్ధ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అస్సాంలోని కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ పైలట్లలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్కర్ (28).. గతేడాది పాక్పై భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్లో పాల్గొన్నారు. పది రోజుల క్రితమే తన కుటుంబంతో సంతోషంగా గడిపి, విధుల్లో చేరారు. పూర్వేశ్ తండ్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ "గతేడాది భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్లో మా కుమారుడు కూడా పాల్గొన్నాడు. జరిగినన్ని రోజులూ పూర్వేశ్ మాతో టచ్లో లేడు. భారత్ సిందూర్‌ను ఆపిన 15 రోజుల తర్వాత ఆ విషయం మాకు తెలిసింది. ఆ ఆపరేషన్ వాయు సేనలో పనిచేస్తున్నందుకు, యుద్ధ విమానాలు నడుపుతున్నందుకు ఎంతో గర్వంగా ఫీల్ అయ్యేవాడు. మాతో ఆ అనుభవాలను పంచుకునేవాడు. బుధవారమే మేం అతడితో మాట్లాడాం. దేశ సేవలో తన ప్రాణాలు అర్పించాడు. అందరికీ నా బిడ్డ ఒక స్ఫూర్తిగా నిలుస్తాడు. సుదీర్ఘంగా దేశానికి సేవలందించాలని ఆశించాడు. కానీ ఆ కల తీరలేదు" అని రవీంద్ర తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మహారాష్ట్రలోని నాగ్పుర్ పూర్వేశ్ స్వస్థలం. పది రోజుల క్రితమే కుటుంబ సభ్యులు నిర్వహించిన గెటుగెదర్లో సంతోషంగా గడిపారు. గురువారం రాత్రి సుఖోయ్. ఆచూకీ లేకుండా పోయింది. ట్రైనింగ్ మిషన్లో భాగంగా జోర్హాట్ ఎయిర్బేస్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే మిస్ అయింది. 60 కి.మీ.దూరంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పూర్వేశ్తో పాటు స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ప్రాణాలు కోల్పోయారు.

# పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం

## ప్రకటించిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

కర్ణాటక ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడాన్ని నిషేధించనున్నట్లు ప్రకటించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 17వ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. మొబైల్ వాడకం వల్ల పిల్లల్లో తలెత్తుతున్న ప్రతికూల భావాలను నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై అక్కడి ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. భారత్‌లో ఈ దిశగా నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు ఇలాంటి చర్యలనే పరిశీలిస్తున్నట్లు గతంలో తెలిపాయి. పిల్లల్లో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించాలనే అంశంపై కర్ణాటక ప్రభుత్వం గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. సీఎం ఇటీవల ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. పిల్లలకు సోషల్



మీడియా బ్యాన్‌కు సంబంధించి వారి నుంచి అభిప్రాయాలు కోరారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ ప్రకటన చేశారు.

# సీఎం పదవిని వదిలి రాజ్యసభకు నితీశ్ కుమార్

బీహార్‌ను అత్యంత ఎక్కువకాలం పాలించిన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఆ పదవిని వీడి రాజ్యసభకు వెళ్లడం ఖాయమయింది. పది రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 37 రాజ్యసభ స్థానాలకు ఈ నెల 16న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. నామినేషన్ల దాఖలుకు చివరిరోజైన గురువారం మొత్తం 40 మంది తమతమ పత్రాలు సమర్పించారు. నీతీశ్, భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, సీనియర్‌నేత ఉపేంద్ర కుశ్వాహా, కేంద్రమంత్రి రాంనాథ్ ఠాకుర్ పట్నాలో నామినేషన్లు వేశారు. రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం) అధ్యక్షుడైన కుశ్వాహాకు భాజపా మద్దతు ప్రకటించింది. శాసనసభలో ఎన్డీయేకి తగిన సంఖ్యాబలం ఉన్నందువల్ల బీహార్ అభ్యర్థుల ఎన్నిక లాంఛనమే. బీహార్‌లో ఏర్పడనున్న నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని నీతీశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. శాసనసభ, శాసనమండలితో పాటు పార్లమెంటు ఉభయ సభల్లోనూ సభ్యుడిగా ఉండాలనేది తన ఆకాంక్ష అని, అది ఇప్పుడు నెరవేరుతోందని పేర్కొన్నారు. కొత్త బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడాబీహార్‌తో బంధం కొనసాగుతుందని తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. తొలుత నీతీశ్ కుమార్ అధికారిక నివాసానికి వెళ్లి ఆయనతో చర్చించారు.

## సోషల్ మీడియాలో ఉగ్రవాద ప్రచారం : మహారాష్ట్ర ఇంజనీరింగ్ విద్యార్థి అరెస్టు

ఉగ్ర సంస్థలతో సంబంధమున్న ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థల హ్యాండ్లర్లతో మహారాష్ట్రకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి అయాన్ షేక్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఎన్క్రిప్టెడ్ యాప్‌లలో వారు పంపుతున్న ఉగ్ర సమాచారాన్ని అతడు సోషల్ మీడియాలో ఇతర విద్యార్థులకు షేర్ చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితుడి ల్యాప్టాప్, మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపామన్నారు. అయాన్ షేక్‌కు ఉగ్ర హ్యాండ్లర్లతో సంబంధం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. ఉగ్ర సంస్థ 'జైషే మహమ్మద్' చీఫ్ మసూద్ అజార్ ప్రసంగాలకు సంబంధించిన పలు వీడియోలు అతడి మొబైల్ ఫోన్లో ఉన్నాయన్నారు. ఈ వీడియోల ద్వారా యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించడానికి, ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చడానికి ప్రయత్నించినట్లు తేలిందన్నారు. ఉగ్రవాదులకు సంబంధించిన ఎన్క్రిప్టెడ్ టెలిగ్రామ్ గ్రూపులలో ఇతర విద్యార్థులను చేర్చుతున్నాడన్నారు.




# అమెరికా ఆస్తుల విధ్వంసమే మా లక్ష్యం

## ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడి

పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. "యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదు" అని ఖతీర్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా 75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. "భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. "ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది" అని అన్నారు.

# కుర్దులకు అమెరికా ఎర?

- ఆయుధాలిస్తాం, ఉద్యమించమంటూ ఎగదోత
- అమెరికాతో కుర్దులకు ఎన్నో చేదు అనుభవాలు
- అయినా.. అమెరికావైపే మొగ్గుచూపుతున్న వైనం
- ట్రంప్ వ్యూహం ఫలించకపోవచ్చన్నది నిపుణుల అంచనా

ఇరాన్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు కుర్దులు కలిసి రావాలని, ఆయుధాల సరఫరాకు అమెరికా సిద్ధమంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన పిలుపునిచ్చారు. ఈ ప్రకటనతో -సుశిక్షిత ఇరాన్ సేనలను ఎదుర్కొనే బలగం కుర్దులకుందా? గత అనుభవనాల నేపథ్యంలో.. ట్రంపరి అమెరికా మాటలను కుర్దులు మళ్లీ విశ్వసించే అవకాశముందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వాస్తవానికి -పశ్చిమాసియాలో కుర్దుల తెగ చిన్నదేం కాదు. ఇస్లాం మతానికి చెందిన వీరు ఇరాన్, ఇరాక్, సిరియా, తుర్కియే దేశాల్లో విస్తరించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలోనే ప్రత్యేక దేశం 'కుర్దిస్థాన్' ఏర్పాటుకు ఉద్యమించినా సాధ్యం కాలేదు. దాదాపు 3 కోట్ల జనాభాగావున్న కుర్దులు.. ఇరాన్‌లోనే కోటి వరకూ ఉంటారని అంచనా. ఇరాన్‌లో దాదాపు అర శతాబ్దానికిపైగా తిరుగుబాటు చేస్తున్న చరిత్ర వీరిది. కుర్దులు విస్తరించిన నాలుగు దేశాల్లోనూ వీరిపై అనేక అరాచకాలు జరిగినట్టు అంతర్జాతీయ సంస్థల నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి.

**అమెరికాను విశ్వసించొచ్చా?**

ట్రంప్ పిలుపు తరువాత కుర్దులను వెంటాడుతున్న ప్రశ్న ఇదే. ఎందుకంటే -సిరియాలో అసద్ ప్రభుత్వంపై వీరోచితంగా పోరాడిన చరిత్ర కుర్దులది. తుర్కీయేలోనూ వీరి జనాభా ఎక్కువగా ఉండటంతో అక్కడి ఎర్డోగాన్ ప్రభుత్వం పలు కఠిన చర్యలు తీసుకుంది. తుర్కియే నాటోలో సభ్యదేశం కావడంతో గతంలో అమెరికా ఈ దళాలకు ఆయుధాలు అందించడం మానేసింది. కొంతకాలం కిందట సిరియాలో



అధికారంలోకి వచ్చిన అహ్మద్ అల్ షరా ప్రభుత్వం.. స్థానికంగా ఉన్న పలు కుర్దు ప్రాంతాలను ఆక్రమించినా అమెరికా పట్టించుకోలేదు. కొన్నేళ్ల క్రితం సిరియా, ఇరాక్‌లలో అనేక దారుణాలకు ఒడిగట్టిన ఐసిస్‌ను తొలిసారిగా నిలువరించింది కుర్దులే అయినా.. గుర్తింపు రాలేదు. 1975లో వీరిపై ఇరాకీ దళాలు దాడులకు పాల్పడితే నాటి అమెరికా అధ్యక్షుడు ఫోర్డ్ వీరిని రక్షించేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. 1988లో వీరిపై సద్దాం ప్రభుత్వం రసాయన ఆయుధాలతో జరిపిన దాడులవైపు అప్పటి అధ్యక్షుడు రీగన్ కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. 1990లో వీరి తిరుగుబాటుకు ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ మద్దతిచ్చారు. సద్దాం సేనలు వీరిని ఇనుపపాదంతో అణచివేసినప్పుడు మాత్రం.. కుర్దులను గాలికొదిలేశారు. చారిత్రక అనుభవాల నేపథ్యంలో కుర్దులు మళ్లీ అమెరికావైపు చూస్తారా? అన్నదే ప్రశ్న.

**అయినా.. అమెరికా వైపే మొగ్గు**

గతంలో చేదు అనుభవాలున్నా.. కుర్దులు మళ్లీ అమెరికా మాటలను విశ్వసిస్తున్నట్టే కనిపిస్తోంది. వీరు విస్తరించిన నాలుగు దేశాల్లోనూ ఆయా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తుండడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో మద్దతివ్వక తప్పడం లేదు. అప్పటికే ఆరు కుర్దు సాయుధ బృందాలు అమెరికాకు మద్దతుగా ఇరాన్ ఐఆర్‌జీసీతో సాయుధ పోరుకు సిద్ధమయ్యాయి. నాటోలో కీలకమైన తుర్కియే మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. కుర్దులు బలపడితే.. తమ దేశంలోని కుర్దులూ వేర్పాటువాదులతో చేయి కలుపుతారన్న భయం తుర్కియేది!

**ఫలితాలనిస్తుందా?**

ఇరాన్‌లో మెజార్టీవర్గం కుర్దులకు మద్దతు పలకకపోవడంతో.. కుర్దులను ఎగదోసి కార్యం సాధించాలన్న అమెరికా వ్యూహం ఫలించకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఐఆర్జీసీ, బాసిజ్ దళాలను ఎదుర్కోవడం కుర్దులకు అంత సులువేమీ కాదు కూడా. కుర్దు దళాలు గెరిల్లా యుద్ధంలోనే సిద్ధహస్తులు. ముఖాముఖి పోరుకు అత్యున్నత సైనిక శిక్షణ అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో కుర్దుల మద్దతు ఏమేరకు ప్రభావం చూపుతుందనేది వేచి చూడాలి. ఇరాన్ ప్రభుత్వ మార్పు కోరుతూ ఆ దేశంలోని ప్రజలు పెద్దఎత్తున ఉద్యమిస్తే తప్ప.. అమెరికా, ఇజ్రాయెల్ ఆశిస్తున్న విధంగా ఫలితాలు ఉండకపోవచ్చన్నది విశ్లేషకుల అంచనా.

## యుద్ధం ఖర్చు తడిసిమోపెడు!

**రోజుకు అమెరికా వెచ్చిస్తున్నది రూ.8వేల కోట్లు**

**బహిర్గతం చేసిని సీఎస్ఐఎస్ నివేదిక**



రెండు దేశాలమధ్య యుద్ధమంటూ మొదలైతే.. గెలుపోటముల మాటెలావున్నా.. ఇరువైపులా భారీ నష్టాలు తప్పవు. యుద్ధాల కారణంగానే కొన్ని దేశాలు ఆర్థికంగా చితికిపోయిన దాఖలాలు చరిత్రలో ఎన్నో. ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధం కోసం అమెరికా చేస్తోన్న భారీ ఖర్చును పలు నివేదికలు బహిర్గతం చేస్తున్నాయి. అయితే, ఇలాంటి వాటికి సంబంధించి అధికారిక సమాచారం ఎప్పటికీ బయటకు రాదు. అది వేరే విషయం!

అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్) అనే సంస్థ ఇస్తోన్న నివేదిక ప్రకారం అమెరికా.. ఇరాన్‌తో యుద్ధం కోసం భారీగా ఖర్చు చేస్తోంది. శుక్రవారనాటికి ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమై వారమైంది. ఇన్ని రోజులు యుద్ధంపై చేసిన ఖర్చుపై అంచనాల్ని తాజా నివేదిక వెల్లడించింది. యుద్ధం మొదలైన మొదటి 100 గంటల్లోనే అమెరికా 3.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అలాగే వారంపాటు సగటున రోజుకు 900 మిలియన్ డాలర్లు ఖర్చయ్యింది. అంటే మన కరెన్సీలో రోజుకు రూ.8,300 కోట్లవరకూ ఖర్చవుతోంది. ఇప్పటికే వాడిన ఆయుధాల స్థానంలో కొత్తవి రూపొందించేందుకు భారీగా ఖర్చవుతుంది. అదనంగా 3.1 బిలియన్ డాలర్లు అవసరం. రోజుకు 758 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల్ని యుద్ధంలో వినియోగిస్తున్నారు. ఫైటర్ విమానాల కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చు రక్షణ శాఖకు కేటాయించిన బడ్జెట్‌కు అదనం. అంటే ఈ నిధుల కోసం అమెరికా రక్షణ శాఖ మళ్లీ నిధుల్ని అడగాల్సి ఉంటుంది. దీనికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం తెలపాలి. అయితే, ఇది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టొచ్చు. అదనంగా నిధులు కోరితే ప్రతిపక్షం వ్యతిరేకించవచ్చు. కానీ, నిధులు లేకపోతే యుద్ధాన్ని కొనసాగించడం కష్టమవుతుంది. ఇప్పటికే అమెరికా ప్రజల్లో ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, చమురు ధరల పెరుగుదల, జీవన వ్యయం పెరగడవంటి వాటిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలు ట్రంప్‌నకు ఇబ్బందిగా మారొచ్చనేది విశ్లేషకుల అంచనా.

## వణుకుతున్న గల్ఫ్ దేశాలు

**ఇరాన్ క్షిపణుల టార్గెట్‌గా దుబాయ్**



ఇరాన్ క్షిపణి దాడులతో.. దుబాయ్ సహా గల్ఫ్ దేశాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పౌరుల రక్షణకు ఆయా దేశాలు కీలక చర్యలు తీసుకుంటున్నా.. ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పౌర రక్షణ చర్యల్లో భాగంగా దుబాయ్ ప్రభుత్వం అక్కడి ప్రజల మొబైల్ ఫోన్లకు మిస్సైల్ దాడులపై అలర్టులు అందించనుంది. ఇప్పటికే కొందరు దీనికి సంబంధించిన అలర్టులను తమ మొబైల్ ఫోన్లలో అందుకున్నారు. ఈ ప్రాంతంలో మిస్సైల్ దాడి జరిగే అవకాశముందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలతో సూచిస్తున్నారు. అలాగే నివాసాల్ని వీడి బయటకు రావొద్దన్నది ప్రధాన సూచన. కొద్ది రోజులుగా దుబాయ్‌పై ఇరాన్ క్షిపణి దాడులతో విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేయడంతో ప్రతిదాడిగా గల్ఫ్ దేశాలను ఇరాన్ టార్గెట్ చేస్తోంది. దీంతో దుబాయ్‌లోని అనేక చోట్ల మిస్సైల్ దాడులతో భారీ నష్టం జరుగుతోంది. పలు భవనాలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. దాడుల కారణంగా దుబాయ్ ఎయిర్‌పోర్టులో విమాన సేవలు నిలిచిపోయాయి. ఇది ప్రపంచంలోనే బిజీగా ఉండే ఎయిర్‌పోర్టుల్లో ఒకటి. దుబాయ్‌లో కొందరు భారతీయులూ చిక్కుకున్నారు. వారిలో చాలామంది గత ఆదివారం ఇండియా తిరిగొచ్చారు. ఇంకా గల్ఫ్ దేశాలనుంచి ఇండియాకు చాలామంది పౌరులు తిరిగి వస్తున్నారు. ఇక.. గల్ఫ్ దేశాలు తాము యుద్ధంలో పాల్గొనబోమని చెబుతున్నాయి. తమ రక్షణకు మాత్రమే స్పందిస్తామని చెబుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో తాము యుద్ధం చేయబోమని యూఏఈ వెల్లడించింది.


## వెలుగులోకి మరిన్ని ఎప్‌స్టీన్ ఫైళ్లు

**మరోమారు ట్రంప్ లైంగిక వేధింపుల ఆధారాలు బహిర్గతం**

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన మరిన్ని ఫైళ్లను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. వీటిల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆధారాలు ఉన్న పత్రాలు బయటికొచ్చాయి. తాను మైనర్‌గా ఉన్నప్పుడు ట్రంప్ తనను లైంగికంగా వేధించినట్టు ఓ మహిళ 2019లో ఎఫ్‌బీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించినట్టు తెలుస్తోంది. తాను 13నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉన్న సమయంలో ఎప్‌స్టీన్ తనను ట్రంప్‌నకు పరిచయం చేసినట్టు మహిళ ఆరోపించింది. అనంతరం వారివురూ తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు పేర్కొంది. ఆ సమయంలో ట్రంప్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్టు వెల్లడించింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం మొదలైనప్పటి నుంచి ఆ ఘటనలకు సంబంధించిన వివరాలు బయటకు చెప్పొద్దని తనకు, తన కుటుంబీకులకు బెదిరింపు కాల్స్ వచ్చినట్టు తెలిపింది. అయితే గతంలో తాము విడుదల చేసిన పలు ఎప్‌స్టీన్ ఫైళ్లలో సదరు మహిళ ట్రంప్‌పై అసత్య ఆరోపణలు చేసినట్టు పలువురు పేర్కొన్నారని న్యాయశాఖ అధికారులు వెల్లడించారు. దీంతో వాటిని పరిశీలనకు పంపామన్నారు. తుది పరిశీలన అనంతరం గురువారం 47వేల పత్రాలు విడుదల చేశామన్నారు. దీంతో ఎప్‌స్టీన్ ఫైళ్లను ట్రంప్ ప్రభుత్వం నిర్వహిస్తోన్న తీరుపై డెమోక్రాట్లు దర్యాప్తు చేపట్టారు. కాగా ఎప్‌స్టీన్ ఫైళ్లతో తనకెలాంటి సంబంధం లేదని గతంలో ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయనపై ఆరోపణలు ఉన్న పత్రాలను న్యాయశాఖ మళ్లీ విడుదల చేయడం గమనార్హం.


## భారత్‌కు మళ్లీ రష్యా చమురు

- యుద్ధంవేళ దిగుమతికి అనుమతించిన అమెరికా
- తీరప్రాంత సమీపంలో 1.5 కోట్ల బ్యారెళ్ల చమురు



ఇరాన్‌తో ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో.. చమురు రవాణాపై తీవ్ర ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఈ సంక్షోభం వేళ భారత్‌కు ఊరట లభించింది. యుద్ధంవేళ రష్యా చమురును దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా మినహాయింపు ఇవ్వడంతో.. రష్యానుంచి 1.5 కోట్ల బ్యారెళ్ల చమురున్న డజనుకుపైగా ట్యాంకర్ నౌకలు బయల్దేరినట్టు బ్లూమ్ బెర్గ్ కథనం వెల్లడించింది. అరేబియా సముద్రం మీదుగా మరికొన్ని రోజుల్లో అవి భారత్‌కు చేరుకోనున్నట్టు తెలుస్తోంది. బ్లూమ్ బెర్గ్ విడుదల చేసిన షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో డజనుకుపైగా ముడి చమురు ట్యాంకర్లు భారత్ తీరానికి సమీపంలో ఉన్నాయి. మరో వారంలో అవి ఓడరేవులకు చేరుకునే అవకాశముంది. దాదాపు 7 మిలియన్ బారెళ్ల రష్యన్ చమురును మోసుకెళ్లే మరో 8 నౌకలు కూడా సింగపూర్ సముద్రప్రాంతంలో నిలిచిఉన్నాయి. అవికూడా త్వరలో భారత్‌కు రానున్నట్టు తెలుస్తోంది. రష్యానుంచి చమురు కొనుగోలుకు అమెరికా లైసెన్స్ జారీ చేయడానికి ముందే.. భారత ఓడరేవులవైపు వచ్చే దిశగా రష్యా నౌకలు తమ గమ్యస్థానాలను మార్చినట్లు బ్లూమ్ బెర్గ్ పేర్కొంది. 2022నుంచి రష్యా చమురును భారత్ గణనీయంగా దిగుమతి చేసుకుంటుంది. అయితే.. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇటీవల ఈ దిగుమతులు తగ్గాయి. ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రవాణాలో అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలోనే రష్యా మళ్లీ ఎగుమతి చేస్తుండడంతో భారత్‌కు చమురు కష్టాలు తొలగిపోయే అవకాశముంది.

## ఇరాన్ ఆక్రమణ.. టైంవేస్ట్ పని



ఇరాన్‌ను ఆక్రమించాలన్న ఉద్దేశం తమకు లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. సమయం వృధా తప్ప, దాంట్లో ఏమీ లేదన్నారు. అమెరికా బలగాలను ఇరాన్‌కు పంపే ఆలోచన లేదన్నారు. ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు..గత శనివారంనుంచి ఇరాన్‌పై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ వార్‌లో ఇప్పటికే వేలమంది చనిపోయారు. క్షిపణులు, డ్రోన్లతో ఇరు దళాలు విరుచుకుపడుతున్నాయి.అయితే భూతల యుద్ధం చేపట్టేందుకు బలగాలను ఇరాన్‌కు పంపాలన్న ఆలోచన తమకు లేదని ట్రంప్ అన్నారు. అలా చేస్తే సమయం వృధా చేయడమే అవుతుందని, ఇరాన్ అన్నీ కోల్పోయిందని, ఆ దేశం నేవీ కూడా పూర్తిగా దెబ్బతిన్నదని, ఆ దేశం అన్నీ కోల్పోయిందని ట్రంప్ అన్నారు. అమెరికా సైనిక దాడులను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ పేర్కొన్న నేపథ్యంలో ట్రంప్ ఈ కౌంటర్ ఇచ్చారు. ఇరాన్‌లో ఉన్న నాయకత్వ వ్యవస్థను మార్చడమే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు. ఆ దేశానికి ఓ మంచి నేత కావాలని, మంచి పాలన చేసే వ్యక్తులు తనకు తెలుసని అన్నారు. అయితే ట్రంప్ తన వ్యాఖ్యల్లో ఎవరి పేరునూ ప్రస్తావించలేదు.

చైతన్య రథం
# సినిమా
శనివారం 7 మార్చి 2026 IX

## ఆ అనుభవం మర్చిపోలేను

మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం గురించి తాజాగా ప్రియాంక చోప్రా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. కెన్యాలో జరిగిన షూటింగును గుర్తుచేసుకున్నారు. కెన్యాలోని అడవుల్లో వేల సంఖ్యలో వైల్డ్ బీస్ట్స్ (భారీ జింకలు) వలస వెళ్తున్న సమయంలో, వాటి మధ్యలో నిలబడి షూటింగ్ చేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని ప్రియాంక పేర్కొన్నారు. ఆ జంతువులను అంత దగ్గరగా చూసినప్పుడు కలిగిన అనుభూతిని ఆమె వివరిస్తూ.. "వాటి ముఖాలు చూస్తుంటే అవి ఎన్ని వేల ఏళ్లుగా భూమిమీద మనుగడ సాగిస్తున్నాయో అర్థమైంది. ప్రకృతి ఎంత శక్తిమంతమైనదో, ఈ భూమిపై జీవపరిణామం ఎంత గొప్పదో వాటిని చూస్తే తెలిసింది. ఆ అడవిలో షూటింగ్ ఒక గొప్ప అనుభూతి" అని ప్రియాంక అన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఈ సినిమా షూటింగ్ కెన్యాలో జరిగింది. అక్కడ షూటింగ్ క్షణాలు ఎప్పటికీ మర్చిపోలేనివని రాజమౌళి కూడా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.



## వృషకర్మ గ్లింప్స్ అదుర్స్



నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న చిత్రం 'వృషకర్మ'.తాజాగా విడుదలైన దీని గ్లింప్స్ ఆదరణ సొంతం చేసుకుంది.దీనిపై దర్శకుడు సుకుమార్ ప్రశంసలు కురిపించారు. కార్తీక్ తనకు స్టోరీ వినిపించినప్పుడు ఆశ్చర్య పోయినట్టు ఆయన తెలిపారు.విజువల్స్ అద్భుతంగా ఉన్నాయన్నారు. నాగచైతన్య మొదటినుంచి ఈ ప్రాజెక్ట్ ప్రతి విభాగం లోనూ భాగమయ్యారన్నారు.

## మోక్షజ్ఞ ప్రాజెక్టుపై.. అప్‌డేట్స్

నందమూరి మోక్షజ్ఞ మొదటి సినిమా.. 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా రాబోతుంది. 'ఆదిత్య 999 మ్యాక్స్' అనే టైటిల్‌తో మోక్షజ్ఞ కథానాయకుడిగా పరిచయం కానున్నాడు. కాగా ఈ సినిమాని ప్రముఖ దర్శకుడు క్రిష్ తెరకెక్కించనున్నాడు. అయితే తాజాగా క్రిష్ ప్రస్తుతం హీరోయిన్ కోసం ఆడిషన్స్ తీసుకుంటున్నాడని తెలుస్తోంది. ఏప్రిల్ రెండోవారంలో సినిమాని పూజా కార్యక్రమాలతో అధికారికంగా మొదలు పెట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాలోని ఇతర క్యాస్టింగ్‌పై క్రిష్ ప్రస్తుతం ఫోకస్ పెట్టాడట. సినిమాలో బలమైన క్యాస్టింగ్ కూడా ఉంటుందట. అలాగే, మోక్షజ్ఞ లుక్ కూడా చాలా స్టైలిష్‌గా ఉంటుందని తెలుస్తోంది. ఇక ఆ మధ్య తన వారసుడి ఎంట్రీపై బాలయ్య మాట్లాడుతూ.. 'మోక్షజ్ఞను ఎలా



ఇంట్రడ్యూస్ చేయాలో నాకు తెలుసు. మోక్షజ్ఞ కోసం ఒక ఐదు ఆరు స్క్రిప్ట్స్ నా మైండ్‌లోనే రెడీగా ఉన్నాయి' అని చెప్పుకొచ్చారు. రచయిత సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకి డైలాగ్స్ రాస్తున్నారు.

## పెద్దిలో అచ్చియ్యమ్మగా..



రామ్‌చరణ్, జాన్వీకపూర్ కాంబోలో దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కించిన సాలిడ్ చిత్రమే "పెద్ది". అయితే ఈ సినిమా జాన్వీకపూర్‌కి మన తెలుగులో రెండో సినిమా కాగా.. దీనిపై కూడా భారీ హైప్ ఉంది. దేవర చిత్రంలానే ఇందులో కూడా ఈమెకి మంచి గ్లామరస్ పాత్ర దక్కింది. ఆల్రెడీ సాంగ్ ఇంకా ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మేకర్స్ జాన్వీ రోల్‌ని అచ్చియమ్మ అంటూ పక్కా ఉత్తరాంధ్ర పాత్రని పరిచయం చేశారు. ఇక నేడు ఆమె బర్త్ డే కానుకగా మరో క్రేజీ పోస్టర్‌ని వదిలారు. ఇక ఇందులో కూడా ఆమె మంచి గ్లామరస్‌గానే కనిపిస్తుంది. చీర లేకుండా, కళ్లద్దాలు పెట్టుకుంటున్న ఓ చిలిపి అమ్మాయిగా ఇందులో కనిపిస్తుంది. దీనితో మేకర్స్ వదిలిన ఈ బర్త్ డే స్పెషల్ పోస్టర్ వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఏప్రిల్ 30న సినిమా గ్రాండ్‌గా పాన్ ఇండియా భాషల్లో విడుదల కానుంది.

## బైకర్‌గా శర్వా..




శర్వానంద్ హీరోగా దర్శకుడు అభిలాష్‌రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'బైకర్'. తొలి భారతీయ మోటోక్రాస్ రేసింగ్ సినిమా ఇది. ఇప్పటికే ఓ పాటను విడుదల చేసిన టీమ్ తాజాగా మరో లిరికల్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేసింది. 'జిద్దీ జిద్దీ' (మొండితనం/పట్టుదల) అంటూ సాగే ఈ గీతం స్ఫూర్తినింపేలా ఉంది. కృష్ణకాంత్ రాసిన పాటను.. స్వీయ సంగీత దర్శకత్వంలో జిబ్రాన్ పాడారు. రాజశేఖర్ కీలక పాత్ర పోషించిన ఈ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది.

### ఊరమాస్ లుక్‌లో శర్వా

శర్వానంద్ దర్శకుడు సంపత్ నందితో చేస్తున్న చిత్రం "భోగి". ఈ సినిమాలో శర్వానంద్ పూర్తిగా మాస్ లుక్‌లోకి మారిపోయిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గా వదిలిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి రెస్పాన్స్ అందుకోగా.. లేటెస్ట్‌గా తన బర్త్ డే సందర్భంగా మరో స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ వదిలారు. ఇందులో శర్వానంద్ మరింత డైనమిక్‌గా రఫ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. "మొన్న గంగని చూసింద్రు. ఇప్పుడు పెనుగంగని చూడుండ్రి" అంటూ తన హీరోకి బర్త్ డే విషెస్ తెలిపాడు దర్శకుడు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లు. భీమ్స్ సంగీతం అందిస్తున్నాడు.

## నో ఛేంజెస్.. సేమ్ డేట్

రణ్‌వీర్‌సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్య ధర్ కాంబినేషన్‌లో చేసిన సాలిడ్ స్పై యాక్షన్ చిత్రం దురంధర్–2. పాన్ ఇండియా లెవెల్లో గ్రాండ్‌గా రిలీజ్‌కి వస్తోన్న సినిమా.. విడుదల డేట్ మారొచ్చన్న చర్చ నిన్నటివరకూ నడిచింది. అయితే, మార్చి 19నే సినిమా థియేటర్లకు రానున్నట్టు తాజాగా కన్ఫర్మ్ చేశారు మేకర్లు. రూమర్లకు కారణం.. ట్రైలర్ డేట్‌పై ఎలాంటి క్లారిటీ లేకపోవడం కూడా. కానీ ఫైనల్‌గా మేకర్స్ సినిమా ట్రైలర్ డేట్‌తోపాటుగా సినిమా రిలీజ్‌పై క్లారిటీ ఇచ్చేసారు. మార్చి 7న ఉదయం 11 గంటలకు దురంధర్ ట్రైలర్ విడుదల చేస్తున్నట్టు ఖరారు చేశారు. అలాగే థియేటర్స్‌లో అనుకున్న డేట్ అంటే మార్చ్ 19నే సినిమా గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్లో విడుదల చేస్తున్నట్టు ఖరారు చేశారు. సో అభిమానులకి ఒక క్లారిటీ వచ్చినట్టేనని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో సారా అర్జున్ హీరోయిన్‌గా నటించగా జియో స్టూడియోస్ బి 62 స్టూడియోస్ వారు చిత్రాన్ని నిర్మించారు.



## అడవి శేష్.. మరో ప్రయోగం!

హీరో అడివిశేష్ తన కెరీర్ విషయంలో చాలా క్లారిటీగా ఉంటాడు. అందుకే ఆయన ఏ సినిమా చేసినా అది బాక్సాఫీస్‌వద్ద మంచి విజయాన్ని అందుకుంటుంది. స్క్రిప్ట్ వర్క్ కోసం ఎక్కువ సమయం కేటాయించే ఆయన, ప్రస్తుతం 'డెకాయిట్', 'గూఢచారి–2' వంటి ప్రతిష్టాత్మక చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, అడివి శేష్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్‌తో ఒక కొత్త ప్రాజెక్ట్ గురించి చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. 'చి ల సౌ' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాహుల్ రవీంద్రన్, ఆ తర్వాత 'మన్మథుడు–2', విమర్శకుల ప్రశంసలు పొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలను తెరకెక్కించాడు. ప్రస్తుతం రాహుల్ రెండు కొత్త స్క్రిప్ట్‌లను సిద్ధం చేసుకోగా, అందులో ఒక కథను అడివి శేష్‌కు వినిపించాడు. ఈ నేరేషన్ శేష్‌కు బాగా నచ్చినప్పటికీ, తన ప్రస్తుత కమిట్‌మెంట్స్‌వల్ల డేట్స్ కేటాయించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు రాహుల్ రవీంద్రన్ త్వరలోనే దీక్షిత్‌శెట్టి హీరోగా ఒక సినిమాను ప్రారంభించనున్నాడు. ఈ ఏడాదిలోనే ఆ సినిమా షూటింగ్ మొదలుకానుంది. అడివి శేష్ తన ప్రాజెక్ట్‌ల నుండి ఫ్రీ అయ్యేలోపు రాహుల్ దీక్షిత్‌శెట్టి సినిమాను పూర్తి చేస్తాడు. అన్నీ కుదిరితే రాహుల్ రవీంద్రన్, అడివి శేష్ కాంబినేషన్‌లో ఒక ఆసక్తికరమైన సినిమా వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియాల్సి ఉంది.

